Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 290 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 నవంబర్ 2023 బుధవారం

### కోయకుండానే కన్నీళ్లొస్తున్నాయ్.. ఉల్లి - 100

చెన్నై : హొసూరు మార్కెట్‌లో ఉల్లికి మళ్లీ ధర పలుకుతోంది. నిత్యం 30 లోడ్లకు పైగా పెద్ద ఉల్లిగ డ్డ లు వస్తాయి. అంతేకాకుండా తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా తిరుచ్చి, దిండుకల్, విరుదునగర్, తెన్కాసీ, నెలై వంటి ప్రాంతాల నుంచి ఉల్లి వస్తోంది. ఇదివరకు నాణ్యమైన ఉల్లి కిలో గరిష్ఠంగా రూ.50 గా ఉండగా తాజాగా సోమవారం రైతుబ జారులో కిలో రూ.100 పలికిది. రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.120 దాకా పలు కుతోంది. దీంతో సామాన్య వినియో గదారులు బెంబేలెత్తుతున్నారు.




# డిసైడ్ చేసేది ఆ ఇరవైఆరే!

## రసవత్తరంగా మారిన తెలంగాణ రాజకీయం!!

హైదరాబాద్ : తెలంగాణాలో హోరా హోరీ పోరు సాగుతోంది అని అందరికీ తెలిసిందే. అధికార బీయారెస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నది ఒక పొలిటికల్ పిక్చర్ అయితే ఇపుడు స్పష్టంగా బయటకు వస్తోంది. ఈ ముఖా ముఖీ పోరు కూడా రసవత్తరంగా ఉ ంటుంది అని అంచనా కడుతున్నారు. ఈ నేపధ్యంలో వివిధ సర్వేలు కూడా వెలువడుతూ అటు బీయారెస్ కి ఇటు కాంగ్రెస్ కి ఆనందం కలిగించే విధంగా నంబర్లు ఇస్తున్నాయి. అయితే ఒక ప్రముఖ చానల్ తో ఒక ప్రముఖ కాంట్రాక్టర్ చేయించిన సర్వేలో చిత్రంగా ఫలితాలు వచ్చాయని అంటున్నారు. ఆ రిజల్ట్ కనుక చూస్తే ఇలా ఉన్నాయి. కాంగ్రెస్ కి 50, బీయారెస్ కి 30, బీజేపీకి 6, మజ్లీస్ కి 7 అని లెక్క వేశారు. ఇక పోటాపోటీగా ఉన్న సీట్లను 26గా తేల్చారు. ఇక్కడ భీకరమైన పోరు సాగనుంది అని అంటున్నారు. ఈ పోరులో ఒక్క ఓటు అటూ ఇటూ అయినా ఫలితం మారే విధంగా ఉన్నది పరిస్థితి అని అంటున్నారు.

ఈ 26 సీట్లే ఇపుడు తెలంగాణాలో కీలకంగా మారాయని అంటున్నారు. ఇక ఈ ప్రముఖ చానల్ కి సర్వే చేసిన సంస్థ వారు నేషనల్ పార్టీకి చేసిన ట్రాక్ రికార్డుని కలిగి ఉన్నారని అంటున్నారు. ఇక చూస్తే ఈ మొత్తం 26 సీట్లలో బీయారెస్ 18 సీట్లను గెలుస్తుంది అని కూడా ఈ సర్వే నివేదికలో చెబుతున్నారు. ఇవి పోనూ మిగతావి కాంగ్రెస్ గెలుస్తుంది అని అంటున్నారు. అంటే కాంగ్రెస్ కి 9 సీట్లు ఇచ్చినట్లు అవుతుంది అన్న మాట. ఇప్పటికే కాంగ్రెస్ కి 50 సీట్లు ఉ న్నాయి. మరి ఈ తొమ్మిది కలిస్తే కచ్చితంగా సింపుల్ మెజారిటీకి చేరువ అవుతుంది ఆ పార్టీ ని అంటున్నారు. అపుడు అతి తక్కువ మెజారిటీతో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం పక్కా అని అంటున్నారు. అయితే ఇక్కడ ఒక ట్విస్ట్ ఉంది. ఈ 26 సీట్లలో బీయారెస్ కి ఎక్కువ సీట్లు వస్తే మాత్రం అపుడు బీయారెస్ బీజేపీ ప్రభుత్వం ఏర్పాట్లు అయ్యేందుకు చాన్స్ ఉంది అని అంటున్నారు. అంటే ఈ 26లో బీయారెస్ కి 20 సీట్లు వస్తే పాత ముప్పయితో ఇవి కలిపిస్తే యాభై సీట్లు అవుతాయి. అలా చూసుకుంటే బీజేపీకి ఆరు సీట్లు మజ్లీస్ కి ఏడు సీట్లు ఉంటాయి కాబట్టి అలా మరోసారి బీయారెస్ ప్రభుత్వం వస్తుంది అని అంటున్నారు. అయితే అది కూడా అంత సులువు కాదు అని మరో వాదన ఉంది. బీజేపీకి దోస్త్ అని ఇప్పటికే మజ్లీస్ మీద విమర్శలు ఉన్న టైం లో అపుడు మజ్లీస్ కీలకం అవుతుంది. ఆ పార్టీ కాంగ్రెస్ వైపు మొగ్గితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా ఆశ్చర్యం లేదు. ఏది ఏమైనా తెలంగాణాలో చూస్తే వచ్చేది ఏ ప్రభుత్వం అన్న దాని మీద రకరకాలైన సర్వేలు వస్తున్నాయి. ఇక అదే సమయంలో మజ్లీస్, బీజేపీ మీద కూడా చర్చ సాగుతోంది. మజ్లీస్ సీట్లు తగ్గించడం బీజేపీ ఓట్లు తగ్గించడం ద్వారా పూర్తి మెజారిటీ సాధించేలా కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది.అందుకే ఆ రెండు పార్టీలను బీయారెస్ తో కట్టి మరీ ప్రచారం చేస్తోంది. ఇది రాహుల్ గాంధీ నుంచి రేవంత్ రెడ్డి దాకా అలాగే ప్రచారం చేస్తూ వస్తున్నారు. మరి ఆ ప్రభావం కనుక పడితే అపుడు తెలంగాణాలో హంగ్ రానే రాదు అని అంటున్నారు. అలా కింగ్ అయ్యే చాన్స్ కూడా కాంగ్రెస్ కి దక్కినా దక్కవచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



## ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

### అందుకు నాంది గజ్వేల్ అవ్వాలి

సిద్దిపేట: సీఎం కేసీఆర్ నియంత పాలనపై తిరుగుబాటు చేసి ఇంత పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గజ్వేల్‌లో 30 వేల కుటుంబాల భూములను లాక్కున్న కర్కోటకుడు కేసీఆర్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మాఫియా విలయతాండవం చేస్తోందన్నారు.
రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. దీనికి నాంది గజ్వేల్‌లో జరగాలని గజ్వేల్ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. “మీరు వేసే ఓటు కేసీఆర్ కుటుంబానికి వేస్తారా? మీ కుటుంబాలకు వేస్తారా. బీజేపీకి ఓటు వేస్తే మీ పిల్లల భవిష్యత్తుకు వేసినట్లు” అని అన్నారు. కాళేశ్వరం నీళ్ళు కేసీఆర్ ఫామ్ హౌస్‌కు వస్తున్నాయన్నారు. గజ్వేల్ ప్రజలు అంగట్లో పశువులు అనుకుంటున్నారని.. డబ్బులిస్తే ఓట్లు వేస్తారని అనుకుంటున్నారని.. కానీ గజ్వేల్ ప్రజలు పులి పిల్లలు అని అన్నారు. లక్షల కోట్ల రూపాయలు వెదజల్లి ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నారని ఆయన విమర్శించారు

## పేదలకు ఐదేళ్లపాటు ఉచిత రేషన్: ప్రధాని మోదీ

హైదరాబాద్: ఢంకా భజాయించి చెబుతున్నా.. భారాస ఓటమి ఖాయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన భాజపా బీసీ ఆత్మగౌరవ సభలో ప్రధాని మోదీ ముఖ్యఅథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారాస, కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. “పుణ్యభూమి తెలంగాణకు ప్రణామాలు. బీసీ ఆత్మగౌరవ సభలో పాల్గొనడం నా అదృష్టం. మీ ఆశీర్వాదంతోనే నేను ప్రధాని అయ్యాను. మీ ఆశీర్వాదంతోనే భాజపా బీసీ వ్యక్తి తెలంగాణ సీఎం అవుతారు. అన్ని వర్గాల ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ఉద్యమం వచ్చింది. నీళ్లు, నిధులు, నియామకాలపై భారాస మోసం చేసింది. తొమ్మిదేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ విరోధి అధికారంలో ఉన్నారు. బీసీల ఆకాంక్షలను ఎప్పుడూ భారాస పట్టించుకోలేదు. తెలంగాణ వచ్చాక బీసీలను మోసం చేశారు. తెలంగాణ ప్రజలు భాజపాపైనే విశ్వాసంతో ఉన్నారు. భారాస.. కాంగ్రెస్ సీటీమ్, కాంగ్రెస్.. భారాస సీటీమ్. భారాస, కాంగ్రెస్ రెండు పార్టీల డీఎన్‌ఏ ఒక్కటే. అవినీతి, కుటుంబ పాలన, బుజ్జగింపు రాజకీయాలు భారాస, కాంగ్రెస్ లక్షణాలు. బీసీల ఆకాంక్షలను పట్టించుకునేది భాజపా మాత్రమే. బీసీలకు ఎక్కువ టికెట్లు ఇచ్చింది భాజపానే. అబ్దుల్ కలామ్‌ను వాజ్‌పేయీ రాష్ట్రపతిని చేశారు. పీఏ సంగ్మా, బాలయోగిని స్పీకర్ చేసింది, రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిని చేసింది, గిరిజన మహిళ ద్రౌపదిముర్మును రాష్ట్రపతిని చేసింది భాజపానే. ఓబీసీ అయిన నన్ను ప్రధానిని చేసింది భాజపానే. ఓబీసీ కేంద్రమంత్రులు ఎక్కువగా ఉన్నది ఎన్డీఏ హయాంలోనే. ఓబీసీలకు ఎంపీలుగా ఎక్కువ అవకాశాలిచ్చింది భాజపానే. బీసీ యువత కోసం భారాస ఏమీ చేయట్లేదు. బీసీలకు రూ.లక్ష ఇస్తామన్న వాగ్దానాన్ని భారాస నెరవేర్చలేదు. మెడికల్, డెంటల్ సీట్లలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు ఇచ్చాం. విశ్వకర్మ పథకం ద్వారా బీసీలకు అవకాశాలిచ్చాం. భారాస నేతల్లో అహంకారం కనిపిస్తోంది. అవినీతి సర్కారును ఇంటికి పంపడం ఖాయం. తెలంగాణలో భాజపా సర్కారు



ఏర్పడటం ఖాయం. పేదలకు ఐదేళ్లపాటు ఉచితంగా బియ్యం అందిస్తాం. పేదలకు ఉచిత రేషన్.. ఇది మోదీ ఇస్తున్న గ్యారెంటీ” అని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అంటరు: సీఎం కేసీఆర్

మంథని: కాంగ్రెస్ హయాంలో రైతులు ఎన్నో బాధలు పడ్డారని సీఎం కేసీఆర్ చెప్పారు. యాభై ఏండ్లకు పైగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏనాడు రైతుల మేలును పట్టించుకోలేదని విమర్శించారు. మంథని నియోజకవర్గంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడిన సీఎం.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని కట్టకపోతే తలుపులు పీక్కపోయిన విషయాన్ని గుర్తుచేశారు. కర్ణాటకలో 5 గంటల కరెంటు ఇస్తున్నమని గప్పాలు కొట్టిన ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కూ చురకలు వేశారు. ‘కాంగ్రెస్ హయాంలో పంట పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి అప్పు తెచ్చుకున్న రైతు తిరిగి కట్టకపోతే ఇంటి తలుపులు పీక్కపోయింద్రు. బావుల కాడి మోటార్లు ఎత్తుకపోయింద్రు. అంతేగానీ రైతుల కోసం నాడు ఒక్క రూపాయి ఇయ్యలే. ఇప్పుడు రైతుబంధు అనే పథకాన్ని సృష్టించింది బీఆర్ఎస్ ప్రభుత్వం. దాంతో ఇయ్యాల్ల కొంచెం కొంచెం రైతుల మొఖాలు తెల్లబడుతున్నయ్. రైతుబంధు రూపంలో పెట్టుబడి వచ్చి, పంటలకు 24 గంటల కరెంటు వచ్చి ఇప్పుడిప్పుడే రైతులు గడ్డకుపడే పరిస్థితి వస్తున్నది’ అని సీఎం చెప్పారు. ‘గ్రామాలు సల్లగుండాలె, వ్యవసాయ స్థిరీకరణ జరగాలె, రైతులు మంచిగ బతుకాలె అని నిర్ణయించి తాము రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలు తీసుకొచ్చినం. కానీ, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు దుబారా అంటున్నడు. కేసీఆర్‌కు ఏం పని లేక రైతుబంధు తెచ్చిండు అంటున్నడు. నిజంగా రైతుబంధు దుబారనేనా..? రైతు బంధును ఎత్తేసేందుకు కాంగ్రెస్ గొడ్డలి భుజాన పెట్టుకుని రెడీగా ఉన్నది. వాళ్లు గెలిస్తే రైతు బంధుకు రాం రాం అంటరు. తీర్థం బోదాం తిమ్మక్క అంటే నేను గుల్లె, నువ్వు సల్లె. తియ్యగ పుల్లగ మాట్లాడితె నమ్మి గోల్‌మాల్ కావద్దు. తర్వాత నేను చేయగలిగేది కూడా ఏముండదు. మీరే కొట్లాడాల్సి వస్తది. నేను 24 ఏండ్లు కొట్లాడిన. ఇగ మీదే బాధ్యత’ అని అన్నారు. ‘ఇప్పుడున్న పీసీసీ అధ్యక్షుడు ఏమంటున్నడు..? కేసీఆర్ కరెంటును దుబారా చేస్తున్నడు, 24 గంటలు ఎందుకు, 3 గంటలు చాలు అంటున్నడు.

మరి 3 గంటల కరెంటు సరిపోతదా..? కర్ణాటకల ఇదే కథ చేసింద్రు. ఎన్నికల ముందు 24 గంటలు ఇస్తమని చెప్పింద్రు. ఇప్పుడు 5 గంటలు ఇస్తున్నం అంటున్నరు. కానీ 4 గంటలే ఇస్తున్నరు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇక్కడ ఓ సభల మాట్లాడుతూ.. తమ దగ్గర రోజుకు 5 గంటల కరెంటు ఇస్తున్నం, కేసీఆర్ కావాలంటే నువ్వు బెంగళూరుకు రా సూద్దువు అంటున్నడు. దానికి నేనేమన్నా 24 గంటల కరెంటు ఇస్తోళ్ల దగ్గరికొచ్చి నువ్వు 5 గంటలు ఇస్తున్నం అంటే దేంతోటి నవ్వాల్రా బాబు నాకర్థతమైతలేదని చెప్పిన’ అని సీఎం వ్యాఖ్యానించారు.



# సంపాదకీయం

## సీక్రెట్ అల్గారిథంతో అమెజాన్ మోసం ఎలా, ఎంత అంటే...?

ఈ కామర్స్ సంస్థ అమెజాన్ సృష్టించిన సంచలనాల సంగతి తెలిసిందే. ఆన్‌లైన్ వ్యాపారాన్ని విపరీతంగా విస్తరించి, ప్రపంచ వ్యాప్తంగా ఈ కామర్స్ దిగ్గజంగా నిలిచింది. ఈ సమయంలో ఈ సంస్థపై యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ సంచలన ఆరోపణలు చేసింది. ఇందులో భాగంగా సుమారు రూ. 100 కోట్లకు పైగా సంపాదించిందని తెలిపింది. ఈ మేరకు కోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసింది. దీంతో ఈ విషయం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది అవును... అమెజాన్ రిటైల్ పరిశ్రమలో లాభాలు పెంచుకోవడానికి సీక్రెట్ అల్గారిథం (ప్రాజెక్ట్ నెస్సీ) వినియోగించిందని యునైటెడ్ స్టేట్స్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ గురువారం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలా సీక్రెట్ అల్గారిథం ద్వారా ఏకంగా రూ. 100 కోట్లు సంపాదించినట్లు పేర్కొంది. వాస్తానికి అమెజాన్ సంస్థకు సంబంధించిన కొన్ని అంశాలను పేర్కొంటూ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ సెప్టెంబర్ లోనే కోర్టులో దావా వేసింది కానీ.. ఇప్పటివరకూ ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఈ సమయలో తాజాగా యూస్ డిస్ట్రిక్ట్ కోర్టులో పిటిషన్ తెరపైకి రావడంతో ఈ కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ పిటిషన్ లో ఫెడరల్ ట్రేడ్ కమిషన్ కీలక విషయాలు వెల్లడించింది. ఇందులో భాగంగా... అమెజాన్ స్టోర్ ల్లో సుమారు ఒక బిలియన్ వస్తువులు ఉన్నాయని.. ఈ సమయంలో వినియోగదారుడికి తెలియకుండానే కొన్ని వస్తువుల ధరలు త్వరలో పెరుగనున్నట్లు ముందుగానే అంచనా వేసే అంతర్గత రహస్య అల్గారిథంను సంస్థ ఉపయోగిస్తుందని పేర్కొంది. ఇందులో భాగంగా... వస్తువులను ఎక్కడ అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందేమోనని ముందుగానే కొనుగోలు చేస్తున్నారని.. దీంతో కస్టమర్లలో ఆందోళన సృష్టిస్తున్నారని.. ఫలితంగా అమెజాన్ ఒక్క అమెరికాలోనే ఏకంగా రూ. 100 కోట్లు సంపాదించిందని ఆ పిటిషన్ లో పేర్కొన్నారని తెలుస్తుంది! ఇదే సమయంలో వినియోగదారులు కొనుగోలు చేయాలనుకునే వస్తువు ధరను బయటి రిటైలర్లతో పోల్చిచూసి.. ఆ వివరాలు నమోదు చేసుకుని.. ఆ తర్వాత అమెజాన్ లో వాస్తవ ధరను మార్చి సదరు వినియోగదారుడికి విక్రయించినట్లు ఎఫ్‌టీసీ తెలిపింది. అయితే ప్రైమ్ డే సేల్స్ ఈవెంట్లు, హాలిడే షాపింగ్ సీజన్ లో కస్టమర్లు ధరల విషయంలో మరింత అప్రమత్తంగా ఉంటారు కాబట్టి.. ఆ సమయంలో ఈ అల్గారిథం ను నిలిపివేస్తున్నారని వివరించింది. అయితే ఈ ఆరోపణలపై అమెజాన్ ప్రతినిధి టిమ్ డోయల్ స్పందించారు. ఫెడరల్ ట్రేడ్ కమిషన్ పిటిషన్ లో తెలిపిన సమాచారం సత్యదూరం అని అన్నారు. నెస్సీ చేస్తున్న ధరల పోలికలు తప్పుగా వస్తుడడంతో చాలా కాలం క్రితమే కంపెనీ ఆ అల్గారిథం ను వాడడం నిలిపివేసిందని తెలిపారు. మరి ఈ వ్యవహారంపై కోర్టులో ఏమి తేలనుందనేది వేచి చూడాలి!

# ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలు అనుసరిస్తూ విధుల నిర్వహించాలి...

## సి విజల్ యాప్ పై విస్తృతంగా ప్రచారం కల్పించాలి...

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్...



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు అవసరమైన అనుమతులను నిబంధనల మేరకు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ నోడల్ అధికారులకు తెలిపారు. నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేర ఈవిఎం యంత్రాలు సర్దుబాటు చేయాల్సి ఉంటుందని, అవసరమైతే అదనపు బ్యాలెట్ యూనిట్లను జిల్లాకు అందించడం జరుగుతుందని, నవంబర్ 18న రెండవ దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను మూడు రోజుల వ్యవధిలో పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల తనిఖీలలో నగదు, బంగారం, ఇతర ఆభరణాలు జప్తు చేసే సమయంలో ఈ.ఎస్.ఎం.ఎస్ యాప్ లో క్షేత్రస్థాయిలో వెంటనే నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రచారం సంబంధించిసమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల, అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. జిల్లాలో ఓటర్ స్లిప్పులు త్వరగా ముద్రించి పంపిణీ చేసే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని , ఓటరు స్లిప్పుల పంపిణీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రారంభించాలని, ప్రతిరోజు ఓటర్ స్లిప్పుల పంపిణీ పై సమీక్ష నిర్వహించాలని అన్నారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలపై అధిక దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగే విధంగా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యకలాపాల కోసం వచ్చే దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ నిబంధనలకు లోబడి ఉన్న వాటికి నిర్ణీత గడువులోపు అనుమతులు మంజూరు చేయాలని, అనుమతుల జారీలో జాప్యం చేయరాదని సూచించారు. ఒకవేళ దరఖాస్తులను తిరస్కరిస్తే, అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. 1950 టోల్ ఫ్రీ, సి.విజిల్, కంట్రోల్ రూమ్‌ల ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. ఫారం-6 , ఫారం-8 ల బదలాయింపు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ దరఖాస్తులు పెండింగ్ లో లేకుండా చూసుకోవాలని అన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి చేయాల్సిన పనులు ఏమిటీ, చేయకూడనివి ఏమిటీ అనే అంశాలపై పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న వారందరికి స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచుతూ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. వెబ్ క్యాస్టింగ్ కోసం ఎంపిక చేసిన వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. తనిఖీల సందర్భంగా నగదు, ఇతర వస్తువులను సీజ్ చేసే సమయంలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని హితవు పలికారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలోనూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్, దివ్యంగుల ఇళ్లకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియ నిర్వహించే సమయంలో నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఈ సమావేశము లో నోడల్ అధికారులు ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో మంగళవారం 13 నామినేషన్ల స్వీకరణ...

### ఎన్నికల నియమావళి పాటిస్తూ తప్పక సహకరించాలి...

### జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ గౌతమ్.

గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మేడ్చల్ జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మంగళవారం రోజున 13 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.

# పునరుజ్జీవమే లక్ష్యంగా అడుగులు..

మెదక్ : మెదక్ జిల్లాలో నర్సాపూర్ అడవులకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. ఇక్కడ ఈసారి మరింత పచ్చదనం పెంచాలన్న లక్ష్యంతో మొక్కలు నాటేందుకు అటవీ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వర్షాకాలం కావడంతో తదనుగుణంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి తదితర మండలాల్లో హరితహారంలో భాగంగా 5 నుంచి 6 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. ఇందులో ఎక్కువగా అటవీ జాతులు నాటాలని నిర్ణయించారు. ఇదివరకే జల సంరక్షణ పనులన్నీ పూర్తిచేసిన అధికారులు అడవుల్లో పడిన ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టేందుకు సన్నద్ధ.మయ్యారు. ఈ ఏడాది అడవుల పునరుద్ధరణకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలపై కథనం.నర్సాపూర్ పేరు చెప్పగానే అడవులే గుర్తుకొస్తాయి. ఇప్పటికే పచ్చని అడవులతో ఆకట్టుకుంటున్న ఈ ప్రాంతంలో మరింతగా అడవులను అభివృద్ధి బాట పట్టించాలని నిర్ణయించారు. దీనికితోడు వర్షాల కోసం అటవీ జాతులు నాటేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. అడవులకు పునరుజ్జీవం తీసుకొచ్చేందుకు, పచ్చదనం పెంచే దిశగా అటవీ అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది నర్సాపూర్‌లో కేంద్రీయ నర్సరీతో పాటు ఆయా గ్రామాలు, మండలాల్లో ప్రత్యేకంగా నర్సరీలు ఏర్పాటుచేసి మొక్కలు పెంచారు. ఇందుకు ఉపాధి హామీ నిధులను వెచ్చించారు.

ఆధునిక పద్ధతుల్లో..నర్సాపూర్ అటవీ క్షేత్రాధికారి పరిధిలో వన్ డెన్సిటీ గ్రీన్ యాక్షన్ పద్ధతిలో నర్సాపూర్, పిల్లుట్ల, నత్నాయిపల్లి, రుస్తుంపేట, నారాయణపూర్ ప్రాంతాల్లో మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఆయా ప్రాంతాల్లో గతంలోని నీలగిరి వృక్షాలను తొలగించి వాటి స్థానంలో అటవీ జాతులను నాటనున్నారు. ప్రతి మొక్క మధ్య మీటరు దూరం ఉండేలా మూడు లక్షల వరకు నాటేందుకు సిద్ధమయ్యారు. వానలు కురవడమే ఆలస్యం.. సదరు ప్రక్రియ మొదలుకానుంది. సెమీ మెకానికల్ మెథడ్ విధానంలో చిప్పల్‌తుర్తిలో 30 హెక్టార్లు, నారాయణపూర్, పిల్లుట్లలో 15 హెక్టార్ల చొప్పున మొక్కలు నాటనున్నారు.

అటవీ జాతులు..ఈసారి అత్యధికంగా అటవీ జాతులు నేరేడు, మర్రి, జువ్వి, నెమలినార, సీమ చింత, మారేడు, కరక్కాయ, తాని, రావి, వెలగ, సీమ, తెల్లమద్ది, కానుగ, వేప, ఇప్ప, మద్ది, బుద్ధధరణి, ఉసిరి, తులసీ, కలబంద వంటి రకాలు నాటాలని సిద్ధం చేశారు. రిజర్వ్‌డ్ ఫారెస్టులో సహజ సిద్ధమైన అడవుల పునరుద్ధరణకు పూనుకున్నారు. అటవీ జాతులు నాటి సంరక్షిస్తే వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశాలున్నాయని ఈ దిశగా అడుగేస్తున్నారు. ఇదివరకే దట్టమైన



అడవులున్న నర్సాపూర్‌కు సుదూర ప్రాంతాల నుంచి ఔషధ మొక్కల కోసం ఎంతోమంది తరలి వస్తుంటారు. పట్టణ ఉద్యానాన్ని సందర్శిస్తుంటారు.

జల సంరక్షణ..

అడవుల్లో పడిన ప్రతి నీటి చుక్క వృథా కాకుండా సంరక్షణకు నడుంబిగించారు. ఇందుకు కంపా నిధులతో 11 చెక్‌డ్యాంలు, నాలుగు ఊట చెరువులు నిర్మించారు. ఒక్కో చెక్‌డ్యాంకు రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వెచ్చించగా.. వెంకట్రావుపేట, నర్సాపూర్, చాకరిమెట్ల సెక్షన్‌లలో నిర్మాణాలు చేపట్టారు. 90 హెక్టార్లలో కందకాలు తవ్వించారు. అడవుల రక్షణకు తీసిన కందకాలకు ఇరువైపులా మొక్కలు నాటనున్నామని అధికారులు ప్రకటించారు. కందకంపై గచ్చకాయ మొక్కలు నాటడం ద్వార అక్రమార్కులు లోనికి వెళ్లడానికి అవకాశం ఉండదు. లోపలి నుంచి వన్యప్రాణులు బయటకు రావడానికి అవకాశం ఉండదు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిస్తే అడవుల్లోని ఊట చెరువులు, చెక్‌డ్యాంలు నీటితో నిండితే తేమ శాతం పెరుగనుంది.

అంతా సిద్ధం

అంబర్‌సింగ్, ఎఫ్‌ఆర్వో, నర్సాపూర్

వర్షాలు పడగానే మొక్కలు నాటుతాం. అంతటా వర్షాలు కురిసినా ఇంతవరకు నర్సాపూర్ ప్రాంతంలో ఆశించినంతగా కురవలేదు. జలసంరక్షణ ద్వారా మొక్కలకు తేమ అందించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. నాటిన వాటిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటుచేస్తాం.

## వజ్రేష్ యాదవ్ గెలుపు కొరకు, కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలి

### కాంగ్రెస్ మూడు చింతలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ భూపాల్ రెడ్డి

శామీర్పేట (గరుడ వార్త) : వజ్రేష్ యాదవ్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలిని కాంగ్రెస్ మూడు చింతలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రాష్ యాదవ్ గెలుపుకు కార్యకర్తల కృషి కీలకమని ఆయన అన్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నందున గ్రామ కార్యకర్తలంతా ప్రజలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన భరోసా



పథకాలను తెలియజేయాలని ఆయన కోరారు. టిఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి నుండి ప్రజలను కాపాడాలంటే కార్యకర్తలు అంతా కాంగ్రెస్ ప్రచారంలో కార్యముకులు కావాలని ఆయన కోరారు. ఈసారి ప్రజల్లో కాంగ్రెస్ పై బలమైన నమ్మకం రోజురోజుకు పెరుగుతున్న వాస్తవాన్ని కార్యకర్తలు గుర్తించి మరింత కష్టపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈసారి తోటకూర వజ్రేష్ యాదవ్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## భార్య బల్వాన్ మరణానికి కారకుడైన భర్తకు పదేళ్ల జైలు శిక్ష 5000 జరిమానా విధించిన న్యాయస్థానం..

### కేసును ఛేదించి నిందితుడికి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకున్న సంబంధిత పోలీసు అధికారులను... అభినందించి, రివార్డు ప్రకటించిన సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర.

గరుడ వార్త జిల్లా బ్యూరో: పోలీసులు తెలిపిన వివరాల అనుసారం... రాజేంద్రనగర్ మండల్ వాస్తవ వాస్తవ్యురాలైన భవాని వివాహము తిరుపతి తో జరిగింది. వివాహమైన ఒక సంవత్సరం పాటు వారి కాపురం అన్యోన్యంగానే సాగింది. అయితే తరువాత తిరుపతి తన భార్య భవానీని అదనపు కట్నం కోసం శారీరకంగా మానసికంగా వేధించడం ప్రారంభించాడు, కగా అది రోజురోజుకు పెరిగిపోవడంతో 8-5-2015 రాత్రి పది గంటల ప్రాంతంలో, భర్త భార్యతో కొట్లాట పెట్టుకొని, అదనం కట్నం కోసం బెదిరించడం వేధించాడు. దీంతో భార్య తన జీవితంపై విసిగివేసారి తన ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పటించుకోవడంతో, తన శరీరం మొత్తం మంటలు అంటుకొని అక్కడికక్కడే చనిపోయింది. భవాని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన రాజేంద్రనగర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి కేసు నమోదు చేసి సదరు కేసును రాజేంద్రనగర్ ఏసిపి గంగారెడ్డికి అప్ప చెప్పడం జరిగింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు 16.5.2015 నిందితుడైన సదరు భర్తను జుడిషియల్ రిమాండ్ కి పంపడం జరిగింది. అటుపిమాట పోలీసులు న్యాయస్థానంలో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్నపిమట, న్యాయస్థానం నిందితుడైన భర్తకు పదేళ్ల జైలు శిక్ష, ఐదువేల జరిమానా విధించడం జరిగింది. కేసును ఛేదించి, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి, నిందితుడికి శిక్షపడేలా చర్య తీసుకున్న సంబంధిత పోలీసులను సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అభినందించి రివార్డు ప్రకటించారు.

## పరిశుభ్రత, అంటూ వ్యాధుల నివారణ పై ప్రత్యేక దృష్టి సారించాలి...

### జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ టి రఘునాథ స్వామి

శామీర్పేట (గరుడ వార్త) : అంటువ్యాధుల నివారణకు ప్రామాణికమైన ప్రమాణాలను అనుసరిస్తూ, పరిశుభ్రత, అంటు వ్యాధుల నివారణ పై ప్రజల్లో వైద్యులు అవగాహన కల్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పి రఘునాథ స్వామి కోరారు. మంగళవారం మూడుచింతలపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి తన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలో అవసరమైన ప్రమాణాలు



పాటిస్తూ, సంరక్షణ నాణ్యమైన వైద్యాన్ని అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ప్రమాణాల యొక్క ప్రాముఖ్యతను గుర్తించడం, గుర్తించిన ప్రామాణిక ప్రోటోకాల్ నిర్వహించడంలో శ్రేష్టమైన పనితీరు కొరకు పబ్లిక్ హెల్త్ కేర్ సౌకర్యాలను ప్రోత్సహించడం వలన మెరుగైన ఆరోగ్య సంరక్షణ ఫలితాలను సమాజానికి ఇవ్వగలుగుతామన్నారు. మూడుచింతలపల్లి మండల ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ దమయంతి డాక్టర్ కౌశిక్, సర్పంచ్ జాము రవి, డిపిఓ మంజులారెడ్డి తదితరులు జిల్లా వైద్యాధికారి సందర్శించిన వేళలో ఉన్నారు.

# ఒకే వీధి.. చెరో దారి..!

యాదగిరిగుట్ట : ప్రధాన ప్రత్యర్థులు వేర్వేరు గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో చూసుంటారు కానీ, ఆలేరు అసెంబ్లీ బరిలో ప్రధాన ప్రత్యర్థులు గొంగిడి సునీత (భారాస), కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల ఐలయ్య (కాంగ్రెస్) మాత్రం ఒకే వీధి వారు కావడం విశేషం. 50 అడుగుల దూరంలోనే ఉండే వీరి నివాసాల వద్ద నిత్యం ఇరు పార్టీల కార్యకర్తలతో సందడిగా ఉంటుంది. ఆ గట్టునుంటావా..నాగన్న.. ఈ గట్టుకొస్తావా.. అన్నట్లుగా కార్యకర్తలు ఒక్కోసారి, అటు, ఇటు మారుతూ కనిపిస్తుంటారు.

ఇద్దరు గ్రామాల నుంచే వచ్చి..

గొంగిడి సునీత సొంత గ్రామం వంగపల్లి అయినప్పటికీ 20 ఏళ్ల నుంచి యాదగిరిగుట్టలోనే ఉంటున్నారు. మొదట అద్దె నివాసంలో ఉండి, 10 ఏళ్ల క్రితం సొంత నివాసం ఏర్పాటు చేసుకున్నారు.



యాదగిరిగుట్ట ఎంపీటీసీ సభ్యురాలిగా 2001లో గెలిచి, ఎంపీపీగా 2006 వరకు పనిచేశారు. ఆ తర్వాత జడ్పీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడి పోయారు. 2009లో ఆలేరు అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఖాళీగా ఉండొద్దని ఆశించి వంగపల్లి గ్రామం నుంచి సర్పంచిగా పోటీ చేసి గెలిచారు. 2014, 2018 నాటి తెరాస నుంచి టికెట్టు రావడంతో వరుసగా గెలిచి, మూడోసారి బరిలో ఉన్నారు. బీర్ల ఐలయ్య స్వగ్రామం సైదాపురం. పాల సంఘం ఛైర్మన్‌గా రాజకీయ జీవితం ప్రారంభించి, 2006 లో సర్పంచిగా పనిచేశారు. స్థిరాస్తి వ్యాపారంలో రాణించి యాదగిరిగుట్టలో నివాసం ఏర్పాటు చేసుకొని 2014లో గుట్ట-2 ఎంపీటీసీ సభ్యుడిగా గెలిచారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌కు ప్రధాన అనుచరుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. భిక్షమయ్య పార్టీ మారడంతో అనూహ్యంగా బీర్ల ఐలయ్య తెరపైకి వచ్చి పార్టీ ఉనికిని కాపాడుకుంటూ వచ్చారు. తన బీర్ల ఫౌండేషన్‌తో సాయంతో సామాజిక కార్యక్రమాల ద్వారా జనంతో మమేకమైన కాంగ్రెస్ పార్టీ దృష్టిలో పడి టికెట్ సాధించారు.

# బోధనలో వెనుకబడి

ఆసిఫాబాద్ : ఈ విద్యా సంవత్సరంలో అయిదు మాసాలు గడిచిపోయాయి. కానీ ఇప్పటి వరకు సగం సిలబస్ కూడా పూర్తి కాలేదు. ఉపాధ్యాయుల బదిలీల వ్యవహారం, ఉన్నతి శిక్షణ, వివిధ రకాల పోటీ పరీక్షలు, ఇప్పుడు ఎన్నికలు సిలబస్ ముందుకు సాగకపోవడానికి కారణాలుగా ఉపాధ్యాయులు చెబుతున్నారు. తుది పరీక్షలకు ఎలా సిద్ధపడాలన్న బెంగ విద్యార్థుల్లో.. సకాలంలో పాఠ్యాంశాలు ఏవిధంగా పూర్తి చేయాలో తోచని స్థితి ఉపాధ్యాయుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో ఎలాగైనా డిసెంబరులోగా సిలబస్‌ను పూర్తి చేయించి పదో తరగతి విద్యార్థులను తుది పరీక్షలకు సిద్ధం చేయాలని విద్యాశాఖ లక్ష్య అనే కార్యక్రమంతో సిద్ధమైంది. నవంబరు నుంచే పది విద్యార్థులకు ఉదయం పూట ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లాలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కస్తూర్బా, తెలంగాణ ఆదర్శ బడులు కలిపి 73 ఉన్నత పాఠశాలున్నాయి. వాటిలో సుమారు 5వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోతున్నారు. యూడైస్ ప్రకారం జిల్లాలో 160 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కలిపి 6816 మంది పది విద్యార్థులున్నారు. ప్రస్తుతం పరీక్ష ఫీజుల చెల్లింపు, నామినల్ రోల్స్ సిద్ధం చేసే పనులు కొనసాగుతున్నాయి. యూడైస్‌లో పేరు నమోదై ఉన్నవారికి పరీక్ష ఫీజు చెల్లించడానికే అర్హత ఉంటుందని విద్యాశాఖ ఆదేశించడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

బదిలీల కాలం.. చదువులు ఆగమాగం

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో ఉపాధ్యాయులు హడావుడి ఉన్నారు. ఆ సమయంలో బోధనపై పూర్తిస్థాయిలో దృష్టిసారించలేక పోయారు. దీంతో సిలబస్ వెనుకబడింది. దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్నవారు బదిలీ



తప్పనిసరి కావడంతో ఎలాగు వెళ్తున్నామన్న ఆలోచనలో తరగతి బోధనకు ప్రాధాన్యం ఇవ్వలేదు. బదిలీ కానివారు నిరాశతో చిత్తంపెట్టి పనిచేయలేక పోయారు. కోర్టుకేసు చిక్కులు, బదిలీ అయినా రిలీవ్ కాలేకపోవడం తదితర కారణాలతో పాఠ్య బోధన కుంటుపడింది. ఆ తర్వాత 13 రోజుల పాటు దసరా సెలవులు, సెలవుల అనంతరం విద్యార్థుల హాజరుశాతం పెరగక బోధన సాగడం లేదు.

తీరికలేని పనులు..ఉన్నతి శిక్షణ, ఎఫ్ఆర్ఎస్, యూడైస్, ఎన్ఎంఎంఎస్, సైన్సు డ్రామా, సైన్సు కాంగ్రెస్, కళోత్సవ్, ఎస్ఐసీ, రాష్ట్ర న్యాస్, బేస్‌లైన్ పరీక్షలు, ఓపెన్ తదితర పనులు, పరీక్షల విధులతో ఉపాధ్యాయులపై భారం పడింది. ఈక్రమంలో పదో తరగతి సిలబస్ వెనుకబడి పోయింది. తాజాగా సాధారణ ఎన్నికల విధులు, శిక్షణ కార్యక్రమాలతో నవంబర్ మాసం కూడా చేజారి పోతోందని ఆందోళన చెందుతున్నారు. పదో తరగతి విద్యార్థుల ఫలితాలను మెరుగుపర్చేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ వారు లక్ష్య పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందుకోసం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. పది విద్యార్థులకు అభ్యాస దీపికలు ఇవ్వడంతో పాటు బోధించే ఉపాధ్యాయులకు కరదీపికలను అందజేశారు. బోధన, సంసిద్ధత, ప్రత్యేక తరగతులు, లఘు పరీక్షలపై రూపొందించిన ప్రణాళికలను అమలు చేసేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

పార్శి అశోక్, డీఈఓ

పదో తరగతి విద్యార్థులకు వెనుకబడిన సిలబస్‌ను పూర్తి చేసేందుకు నవంబరు 6 నుంచి ఉదయం పూట గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం. డిసెంబరులోగా సిలబస్‌ను పూర్తి చేసి అనంతరం పునశ్చరణ(రివిజన్), ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం చేస్తాం.

# పట్టణం పల్లెల సమ్మిళితం.. వర్ధన్నపేట






జనగామ : వర్ధన్నపేట శాసనసభ నియోజకవర్గం పట్టణం, పల్లెలు కలిసి వరంగల్ మహానగరం చుట్టూ విస్తరించి ఉంది. వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో ఉన్న వర్ధన్నపేట నియోజకవర్గం ఆధ్యాత్మిక, వాణిజ్య, వైద్య, విద్యరంగాల్లో పేరుగాంచింది. వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు, హనుమకొండ, ఖిలావరంగల్, కాజీపేట, హసన్‌పర్తి, వరంగల్ మండలాల పరిధిలో ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో వర్ధన్నపేట పురపాలక సంఘంతోపాటు గ్రేటర్ వరంగల్‌లోని 41 గ్రామాలు విలీనం కాగా 11 డివిజన్లు ఉన్నాయి.

నియోజకవర్గం ముచ్చట

1952 నుంచి 2018 వరకు 15 సార్లు శాసనసభకు ఎన్నికలు జరిగాయి. పీడీఎఫ్ అభ్యర్థిగా 1952లో పోటీ చేసిన పెండ్యాల రాఘవరావు విజయం సాధించి తొలి ఎమ్మెల్యేగా నిలిచారు. ఈ ఎన్నికల్లోనే ఆయన వరంగల్ ఎంపీగా, హనుమకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కూడా గెలుపొందారు. అనంతరం 1957 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో ఐఎన్‌సీ, స్వతంత్రులు, జేఎన్‌పీ, ఐఎన్‌సీ, భాజపా, తెదేపా, కాంగ్రెస్, తెరాస అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మంత్రి దయాకర్‌రావు వర్ధన్నపేట నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో మాత్రమే ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. 2009లో జరిగిన పునర్విభజనలో ఎస్సీ నియోజకవర్గంగా మారింది. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండేటి శ్రీధర్ విజయం సాధించారు. 2014, 2018 ఎన్నికల్లో తెరాస తరఫున బరిలో నిలిచిన అరూరి రమేశ్ గెలుపొందారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు ఇక్కడి వారే..

ఎర్రబెల్లి దయాకర్‌రావు, కడియం శ్రీహరి, బోయినపల్లి వినోద్‌కుమార్, పురుషోత్తమరావు స్వగ్రామం పర్వతగిరి. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సొంత గ్రామం ఐనవోలు మండలం పున్నేలు. వర్ధన్నపేటకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, టి.రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, దుగ్యాల శ్రీనివాసరావు, నేతలు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, ఎర్రబెల్లి స్వర్ణ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ తితిదే బోర్డు సభ్యుడు ఈగ మల్లేశం తదితరులు కూడా నియోజకవర్గం వారే. వీరంతా వివిధ హోదాల్లో పని చేశారు.

పురుషోత్తమరావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కడియం శ్రీహరి రాష్ట్ర మంత్రులుగా పనిచేశారు.

ఆధ్యాత్మిక కేంద్రాలకు ఆలవాలం..

ఐనవోలులో శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా పేరుగాంచింది. పర్వతగిరి మండలం అన్నారంలో ఉన్న యాకూబ్ షావలి దర్గాలో ముస్లింలు, హిందువులు మొక్కులు చెల్లించుకుంటారు. ఐనవోలు మండలం రెడ్డి పాలెం చర్చి, భీమారం సమీపంలోని ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి, మడికొండలోని మెట్టుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా కొనసాగుతున్నాయి.

యువగళం భవిష్యత్తు నిర్ణయించేది ఓటే..

అంతర్జాతీయ అథ్లెట్ జీవంజి దీప్తి

పల్లె కీర్తిని ప్రపంచ దేశాలకు చాటుతున్న అథ్లెట్(పరుగు పందెం) జీవంజి దీప్తి నేటి యువతకు స్ఫూర్తి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన ఆమె నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆమె ఆటలో రాణించి ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల చైనాలో జరిగిన పారా ఆసియా క్రీడల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన దీప్తి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని యువతకు సూచించారు..

మీకు ఓటు ఎక్కడ ఉంది, మొదటిసారి ఎక్కడ వేశారు

వర్ధన్నపేట నియోజకవర్గం కల్లెడ గ్రామంలో ఓటరుగా నమోదయ్యాను. తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోబోతున్నా.

ఓటు వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయనుకుంటున్నారు

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది. విధిగా సద్వినియోగం చేసుకోవాలి. భవిష్యత్తు నిర్ణయించేది కేవలం ఓటు మాత్రమే.

యువతకు ఎన్నికలపై మీరు ఇచ్చే సందేశం నేను తొలిసారిగా ఓటు వినియోగించుకునే అవకాశం ఈ ఎన్నికల ద్వారా లభించింది. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నచ్చిన నాయకుడికి ఓటు వేయాలనేదే నా ఉద్దేశం. ఎవరో చెబితేనో.. ఏదో ఇస్తారనో భావించి ఓటును దుర్వినియోగం చేయొద్దు.

# జోరందుకున్న వరి కోతలు



కోనరావుపేట : వానాకాలంలో సాగు చేసిన వరి కోతలు జోరందుకున్నాయి. రైతులు సేకరించిన ధాన్యం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. ధాన్యం కుప్పలతో కేంద్రాలు నిండిపోవడంతో స్థలం కొరత నెలకొంది. మరోవైపు ధాన్యం విక్రయానికి అవసరమైన తేమశాతం వచ్చేలా ఆరబెట్టడానికి అన్నదాతలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. జిల్లాలో వానాకాలంలో ధాన్యం దిగుబడి 3.5 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ధాన్యం కొనుగోలుకు ఐకేపీ ఆధ్వర్యంలో 45, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు-200, మెప్మా-4, డీసీఎంఎస్-9 కేంద్రాల ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు కొన్నిచోట్ల మాత్రమే ప్రారంభించారు. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట చేతికి రావడంతో వాటిని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యం వల్ల కొందరు మిల్లర్లకు విక్రయిస్తున్నారు. పక్షం రోజులుగా సేకరించిన ధాన్యం మద్దతు ధరకు విక్రయించటానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పోశారు. చలికాలం కావడంతో పొద్దంతా ఆరబోయడం, సాయంత్రం కుప్ప పోయడం చేస్తున్నారు. కేంద్రాల్లో సౌకర్యాలేమి అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని చోట్ల కుప్పలు పోయడానికి స్థలం కొరత ఏర్పడింది. దీంతో ప్రధాన రహదారులపైన, వ్యవసాయ క్షేత్రాల్లో కుప్పలు పోస్తున్నారు. కోనరావుపేట, నిమ్మపల్లి గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పోయగా మహిళా సంఘాల నిర్వాహకులు కొనుగోలుకు విముఖత చూపారు. సేకరణ బాధ్యతలను ఇతరులకు అప్పగించాలని జిల్లా అధికారులకు లిఖితపూర్వంగా తెలియజేశారు. దీంతో సేకరణలో ప్రతిష్టంభన నెలకొంది. కొందరు కోసిన వెంటనే నేరుగా మిల్లులకు తరలించడంతో క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.400 వరకు నష్టపోతున్నారు.మద్దతు ధర ఇలా..ప్రభుత్వం ధాన్యానికి క్వింటాల్‌కు ఏ గ్రేడ్‌కు రూ.2,203, 'బి' గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధర నిర్ణయించింది. ధాన్యం తేమశాతం 17, మట్టి పెళ్లలు, రాళ్లు 1, చెత్త, తాలు 1, రంగమారిన మొలకెత్తినవి 5, తక్కువ రకాల మిశ్రమం 6 శాతం వరకు అనుమతిస్తారు.

తూకంలో జాప్యం లేకుండా...- ఉప్పుల అంజయ్య, రైతు, నిజామాబాద్ గ్రామంలో సుమారు 2 వేల ఎకరాల్లో వరి సాగు చేశాం. పక్షం రోజులుగా సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించడానికి కుప్పలు పోశాం. ధాన్యంతో కొనుగోలు కేంద్రాలు నిండిపోవటంతో ఇతర రైతులకు స్థలం కొరత నెలకొంది. నేను మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేయగా 12 రోజులు క్రితం వరి కోతలు కోసి ధాన్యాన్ని మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో పోశాం. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి తూకంలో జాప్యం లేకుండా చూడాలి.

రూ. 1,800లకు విక్రయించా- ఏనుగు తిరుపతి, రైతు, రహీంఖాన్‌పేట నేను పది ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎనిమిది ఎకరాల్లో కోసి క్వింటాల్ రూ.1800 చొప్పున మిల్లరుకు విక్రయించాను. దీంతో క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.400 వరకు నష్టపోయాను. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం వల్ల రైస్ మిల్లర్లు, మధ్యదళారులకు అమ్మడం జరిగింది. గన్నీ సంచులు సరఫరా చేస్తున్నాం- అయిల్నేని పాపారావు, ఐకేపీ డీపీఎంజిల్లాలోని రైస్ మిల్లుల నుంచి గన్నీ సంచుల వివరాలు సేకరించి ధాన్యం నిల్వల ఆధారంగా సరఫరా చేయిస్తున్నాం. ఇప్పటికే కొన్ని చోట్ల కేంద్రాలను ప్రారంభించాం. రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తీసుకువచ్చి తూకాల్లో జాప్యం లేకుండా సహకరించాలి.

# వరి కోతలు.. ప్రచార మోతలు

కరీంనగర్ : ఓ వైపు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమకు ఓట్లు దండిగా పడాలని తహతహలాడుతుంటే.. మరోవైపు ఆరుగాలం శ్రమించి పండించిన పంట దిగుబడి లాభసాటిగా రావాలని అన్నదాతలు కోరుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం వరి కోతలు మొదలయ్యాయి. పత్తి కూడా తీస్తున్నారు. వీటి అమ్మకాలు ప్రారంభమయ్యాయి. అభ్యర్థుల నామినేషన్ల పర్వం మొదలుకావడంతో ప్రచారం ఊపందుకోనుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రచారం ఉదయం, రాత్రివేళల్లో చేపడుతున్నారు. 20 శాతం పూర్తి..వానాకాలం వరి పంట కోతలు 20 శాతం పూర్తయ్యాయి. ఈ నెలాఖరు నాటికి మొత్తం పూర్తవుతాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతు కుటుంబాలతోపాటు కూలీలు వరి పంటల కోతలపై, పత్తి తీయడంలో నిమగ్నమయ్యారు. ఈనెల మొత్తం ఈ పనులు సాగుతాయి. మరో వైపు ఈనెల 30న ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి ఇదే కీలక సమయం కావడంతో నాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం..వరి కోతల సమయం కావడంతో రైతు కుటుంబాలు ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత అందుబాటులో ఉంటున్నాయి. ప్రచారం చేసుకోవడానికి నాయకులు ఈ సమయాలను ఎంపిక చేసుకుంటున్నారు. చౌరస్తా సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. కూడళ్ల దగ్గర సమావేశాల్లో గంటపాటు పాల్గొంటే మహిళలకు రూ.100 నుంచి రూ.200 చెల్లిస్తున్నట్లు సమాచారం.

# ఎన్నికల హోరు.. అక్రమాల జోరు

ఆసిఫాబాద్: అధికారులందరూ ఎన్నికల విధుల్లో ఉండటంతో ఇదే అదనుగా అక్రమార్కులు తమ పనులను చక్కదిద్దుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన వెంచర్లలో గుట్టుచప్పుడు కాకుండా ఇంటి నంబర్లు తెచ్చుకోవడం వంటి అక్రమాలు ఒకవైపు సాగుతుండగానే మరోవైపు బీడీపీపీ (బిలా దాఖలా పోరంబోకు) భూముల్లో హుటాహుటిన నిర్మాణాలను పూర్తి చేస్తున్నారు. గతంలో భూ ఆక్రమణలను వరుసగా వెలుగులోకి తీసుకురాగా, అడపాదడపా వీటిని అడ్డుకున్న అధికారులు ప్రస్తుతం ఎన్నికల పనుల్లో తీరిక లేకుండా ఉండటంతో భూ మాఫియా ఆగడాలకు హద్దు లేకుండా పోతోంది. ఇప్పటికే వందలాది ఎకరాల అసైన్డ్, లావుణి పట్టా భూములు చేతులు మారగా, భారీ భవనాలు వెలుస్తున్నాయి.

నాలుగు వరుసల జాతీయ రహదారి పక్కన అయిదు ఎకరాల బీడీపీపీ భూముల్లో కొందరు వ్యక్తులు వెంచర్ వేశారు. తక్కువ ధరకు ప్లాటు వస్తోందని అనేక మంది ప్లాట్లు తీసుకున్నారు. ఈ అక్రమ వెంచర్‌పై 'ఈనాడు'లో కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు హద్దురాళ్లను తొలగించారు. దీంతో ప్లాట్లను కొనుగోలు చేసిన వ్యక్తులు విక్రయించిన వారిపై ఒత్తిడి తెచ్చారు. దాదాపు 20 ప్లాట్లను రూ.1.50 కోట్ల వరకు



విక్రయించగా.. వారందరూ భూములను విక్రయించిన వారితో గొడవకు దిగుతున్నారు. మా డబ్బులు మాకు ఇవ్వండి లేదా ఇంటి నిర్మాణానికి అనుమతులు వచ్చేలా చూడాలని పేచీ పెడుతున్నారు.

ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్..

ఈ తరుణంలో కొందరు పంచాయతీ అధికారులను మచ్చిక చేసుకున్న రియల్టర్లు ఇంటి నంబర్లు ఇప్పిస్తాం మాకు రూ.2 లక్షల వరకు ఇవ్వాలని బేరానికి దిగారు. మీరైతే ఇల్లు నిర్మించుకోండని చెప్పడంతో మళ్లీ నాలుగు వరుసల రహదారి పక్కన చిన్నపాటి నిర్మాణాలు మొదలయ్యాయి. మొదట వీటిని నిర్మించి స్థలం మరొకరు ఆక్రమించుకోకుండా చూసి, పరిస్థితులు చక్కపడ్డాక భారీ భవనాలు ఏర్పాటు చేసుకోవచ్చని రియల్టర్లు చెబుతున్నట్లు సమాచారం.

నీ జడ్పీ కార్యాలయం వెనుక ఉన్న 40 ఎకరాల్లో 240 ప్లాట్లు చేశారు. అతి తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఉద్యోగులు దొడ్డిదారిన ఇంటి నంబర్లు తెచ్చుకున్న బాగోతం గత నెలలో వెలుగు చూసింది. రిజిస్ట్రేషన్ కాని ఈ స్థలాలను ఇంటి నంబరు ద్వారా సక్రమంగా మార్చుకుని రిజిస్ట్రేషన్ చేయించాలని రియల్టర్ల ఆలోచన. ఈ తతంగం విచారణ చేసిన అధికారులు, ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆశాఖ అధికారులే పెదవి విరుస్తున్నారు.

# ఫిరాయింపులతో.. దక్కిన ఉపాధి

మంచిర్యాల : ఒకప్పుడు ఎన్నికల సందడే వేరుగా ఉండేది. ఖాళీ గోడలు కనిపిస్తే చాలు ఆయా పార్టీలకు సంబంధించిన వ్యక్తులు రాత్రికి రాత్రి గుర్తులు, అభ్యర్థుల పేర్లు ఇంటి యజమాని అనుమతి లేకుండానే రాస్తుండేవారు. పోటీ పడుతూ జెండాలు, ప్రచార పోస్టర్లు ఏర్పాటు చేసేవారు. దీంతో ఆర్టిస్టులకు గిరాకీ భారీగానే ఉండేది. నెలల తరబడి ఉపాధి దొరికేది. ఆ తర్వాత ఫ్లెక్సీలు అందుబాటులోకి రావడం, నిమిషాల్లో సిద్ధం అవుతుండటంతో పార్టీల నాయకులు వీటిపై మొగ్గు చూపడం మొదలైంది. గత కొంత కాలంగా ఎన్నికల కమిషన్ నిబంధనలు కఠినతరం చేయడం, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టారీతిన ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేయడం నిషేధించారు. పరిమితులతో కూడిన ప్రచారానికి అనుమతి ఇస్తుండటం, చేసిన ఖర్చులకు లెక్కలు అడుగుతుండటంతో పార్టీలన్నీ వెనకడుగు వేయడం ప్రారంభించాయి. అత్యవసరమైన ప్రచార రథాలకే ఉపయోగించడంతో ఎన్నికల వేళ ఫ్లెక్సీల కేంద్రాలు కళకళలాడాల్సి ఉండగా నిర్వాహకులకు కాస్త ఉపాధి కరవైంది. కానీ పార్టీ ఫిరాయింపులతో కొంత మెరుగైనట్లు కనిపిస్తోంది.

ఫ్లెక్సీల నిషేధంతో కుంటుపడి.. ఎన్నికల సమయంలో బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, ఫ్లెక్సీలు పూర్తిగా నిషేధించడంతో కొన్నేళ్లుగా ఆయా కేంద్రాలకు గిరాకీ పూర్తిగా తగ్గింది. ప్రచార వాహనాలు, సభలు, సమావేశాలకు నిబంధనలతో కూడిన అనుమతి ఇస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ఉన్న ఆయా కేంద్రాలు వెలవెలబోతున్నా



యి. పార్టీ కండువాలు, వాహనాల పోస్టర్లు తప్ప మరే రకమైన గిరాకీ ఉండటం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో ఎన్నికల వేళ తీరిక లేకుండా ఉండగా ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నామంటున్నారు.

కలిసొచ్చిన నేతల పార్టీ మార్పు

ఇటీవల ఊపందుకున్న పార్టీ ఫిరాయింపులతో గుడ్డిలో మెల్ల అన్నట్లుగా ఫ్లెక్సీ కేంద్రాలు, ఆర్టిస్టులకు కొంత ఉపాధి పెరిగినట్లు కనిపిస్తోంది. భాజపా, భారాస, కాంగ్రెస్, బసపా తదితర పార్టీల ముఖ్య నాయకుల మార్పులతో కొంత గిరాకీ ఊపందుకుంటుందని కేంద్రాల యజమానులు చెబుతున్నారు. రెండు, మూడు నెలల నుంచే ప్రచారం చేస్తుండగా అప్పటి పోస్టర్లలో ఉన్న వ్యక్తులు ఏ సమయంలో ఏ పార్టీ మారుతారో అర్థం కాకుండా ఉండటం, అనంతరం ఫ్లెక్సీల్లోని ఆయా నాయకుల చిత్రాలను తొలగించడం, నూతనంగా సిద్ధం చేయిస్తుం డటంతో కొంత మెరుగైనట్లు తెలుపుతున్నారు. పార్టీలో గుర్తింపు పొందిన, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు నామినేటేడ్ పదవులు ఉన్నవారు కావడంతో పార్టీ ప్రచారంలో వారి చిత్రాలు తప్పనిసరిగా మారింది. సంబంధిత వ్యక్తులే మారుతుండటం, వారి చిత్రాలు తొలగించాల్సిన అవసరం పడుతుండటంతో గత్యంతరం లేక ప్రస్తుత అభ్యర్థులు నూతన ఫ్లెక్సీలు తయారు చేయించాల్సి వస్తోంది. వీరికి ఖర్చు పెరుగుతుండగా తయారీదారులకు కాస్త ఉపాధి లభిస్తుండటం విశేషం.

# ఘాటెక్కిన ఎర్ర బంగారం

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో.. సీజన్‌లోనే అత్యధిక మిరప నమూనాలు రావటంతో కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన రైతులు సీజన్‌లో గిట్టుబాటు ధర రానప్పుడు తమ మిరప బస్తాలను ఖమ్మంలోని శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకుంటారు. రైతులతో పాటు వ్యాపారుల సరకు కూడా వీటిలో నిల్వ ఉంటుంది. గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకోవడం ఆనవాయితీగా వస్తోంది. నమూనాలు పరిశీలించిన తర్వాతే వ్యాపారులు ధర నిర్ణయిస్తారు. మూడు రోజుల నుంచి ఏసీ మిరప క్వింటా గరిష్ఠ



ధర రూ.25 వేల వరకు పలుకుతోంది. అనేక మంది రైతులు, వ్యాపారులు తమ సరకును విక్రయించేందుకు మిరప నమూనాలను వ్యవసాయ మార్కెట్‌కు తెస్తున్నారు. సహజంగా రోజుకు 150 నుంచి 200 మించి మిరప నమూనాలు మార్కెట్‌కు వస్తాయి. మూడు రోజుల నుంచి క్వింటాకు రూ.300 చొప్పున ధర పెరిగిన నేపథ్యంలో తమ పంటను అమ్ముకునేందుకు ఎక్కువ మొత్తంలో రైతులు విపణికి వస్తున్నారు. బుధవారం 270 మిరప నమూనాలు రాగా గురువారం సీజన్‌లోనే అత్యధికంగా 470 వరకు రావడం విశేషం. ధరల పెరుగుదల నేపథ్యంలో నమూనాలు ఎక్కువగా వస్తున్నట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. కొనుగోళ్లు ఒక్కసారిగా ఊపందుకోవడంతో విపణిలో కోలాహలం నెలకొంది. మార్కెట్ కమిటీ లెక్కల ప్రకారం గురువారం ఏసీ మిరప 4,091 బస్తాలు, నాన్ ఏసీ మిరప 663 బస్తాలను కొనుగోలు చేశారు. విదేశాలకు ఎగుమతి చేసే వ్యాపారులు, మన దేశంలోనే వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేసే వ్యాపారులు ఇప్పుడు విపణిలో పోటీపడి సరకును కొనుగోలు చేస్తున్నారు. ఇంకా శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న సరకును అమ్మేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. ధర మరింత పెరుగుతుందని మరికొంత మంది ఎదురుచూస్తున్నారు.

## నామం..ప్రత్యేకతల సమాహారం..

సిద్దిపేట : ఓ ప్రాంతానికి పేరు స్థిరపడటం వెనుక ఎన్నో కారణాలు ఉంటాయి. దీనికితోడు అక్కడ విశేషాలు ప్రసిద్ధి చెందేలా చేస్తాయి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ప్రతి నియోజకవర్గానికి ఎన్నో ప్రత్యేకతలు ఉండటం విశేషం. ఎన్నికలకు ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఆయా విశేషాల సమాహారమే ఈ కథనం.

ప్రత్యేక పంథా.. సిద్దిపేట

పూర్వం నవనాథ సిద్ధులు పట్టణానికి సమీపంలోని రంగనాయక గుట్టపై తపస్సుతో సిద్ధిని పొందారు. వారే ఈ పట్టణానికి ముగ్గు పోయించి నామకరణం చేసినట్లు చరిత్ర. తొలుత సిద్ధిపురిగా పిలిచేవారు. కాలక్రమంలో సిద్ధిపేటగా మారింది.

రాజకీయ దురంధరుల గడ్డగా ప్రసిద్ధి. వాణిజ్య, వ్యాపార కేంద్రం. ఎల్లలు దాటి ఘన కీర్తిని పొందిన గొల్లభామ చీర పురుడుపోసుకుంది ఇక్కడే. పేటెంటు హక్కు పొందారు.

దుబ్బాక.. చేనేతకు ప్రసిద్ధి

దుర్వాస మహాముని ఈ ప్రాంతంలో తపస్సు చేయగా దుర్వాస పేరొచ్చింది. ఇక్కడి రెండు తోటలను దోబాగ్‌గా పిలిచేవారు. ఈ రెండూ కలిసి దుబ్బాకగా మార్పు చెందింది. చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి. నార్సింగిలో ఎక్కువగా బాస్మతి పండిస్తారు. తొలి గిరిజన బాలికల క్రీడా పాఠశాల చేగుంటలో ఏర్పాటైంది. ముందుగా రాజగోపాలపేట, ఆ తర్వాత దొమ్మాట, ప్రస్తుతం దుబ్బాక నియోజక వర్గంగా మారింది.

విలక్షణం.. వికారాబాద్

ఆరో నిజాం మీర్‌మహబూబ్‌అలీఖాన్ వద్ద ప్రధానిగా పని చేసిన నవాబ్ వికారుల్ ఉమ్రా సొంత జాగీరు కావడంతో వికారుల్ ప్రాంతంగా పిలిచేవారు. కాలక్రమేణా వికారాబాద్‌గా వాడుకలోకి వచ్చింది. నియోజకవర్గంలోని నవాబుపేటలో కూరగాయలు ఎక్కువగా పండిస్తారు. మర్పల్లి మండలంలో అల్లం సాగు చేస్తుంటారు. అనంత పద్మనాభస్వామి ఆలయం ప్రసిద్ధికెక్కింది.

ఖనిజాల ఖిల్లా.. తాండూరు

ఈ ప్రాంతంలో గిరిజన తండాలు అధికంగా ఉండటంలో తండా ఊరు పిలిచేవారు. ఇదే కాలక్రమేణా తాండూరుగా మారింది. నియోజకవర్గం నాపరాళ్లు, సున్నపురాయి గనులు, సుద్ద, లేటరైట్ ఖనిజాలకు ప్రసిద్ధి. నాపరాయిని విదేశాలకు ఎగుమతి చేస్తారు. సిమెంటు ఉత్పత్తి కర్మాగారాలు వెలిశాయి. కంది దేశ వ్యాప్తంగా పేరు గాంచింది. భౌగోళిక గుర్తింపు లభించింది.

అందోలు: తలమానికం

క్రీ.శ.1764లో ఈ ప్రాంతాన్ని ఏలిన రాణి శంకరమ్మ కాలంలో అందోలు పేరిట చిన్న గ్రామం ఉండేది. సమీపంలోని జోగిపేటను కలుపుతూ అందోలు పేరిట చెరువు ఉండేది. దీని పేరిటే పేరొచ్చింది. సింగూరు ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌లో పలు ప్రాంతా లకు నీరు సరఫరా చేస్తున్నారు. జోగిపేట బంగారం, వస్త్ర వ్యాపారాలకు కేంద్రం. గ్రంథాలయ ఉద్యమానికి వేదిక. క్లాక్ టవర్ ప్రసిద్ధి.

నాటి పరిగె.. నేటి పరిగి

నిజాం కాలంలో ఈ ప్రాంతం వెనుకంజలో ఉండేది. పండిన పంట తర్వాత రెండోసారి తీసుకునేదే పరిగె. వేలాది కుటుంబాలు దీనిపైనే ఆధారపడేవి. ఇలా పరిగె పేరు రాగా.. అది పరిగిగా స్థిరపడింది. పరిగి అభివృద్ధిలో వెనుకబడినా.. ఇక్కడి నుంచి ఎంతో మంది నాయకులు ఉన్నత స్థానాలను అధిరోహించారు. వరి ప్రధాన పంట.

త్రిలింగ ప్రాంతం.. నారాయణఖేడ్‌నిజాం పాలనలో లక్ష్మీనారాయణపురంగా పిలిచేవారు. ఖేడ్ పట్టణం చెరువుగా ఉండగా పదుల సంఖ్యలో ఇళ్లు ఉండేవి. చెరువును ఉర్దూలో నాలా అంటారు. నిజాంలు నాలా చెరువుగానే పిలిచేవారు. కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దులో విస్తరించి ఉంది ఈ నియోజకవర్గం. రెండు రాష్ట్రాల సంప్రదాయాలు ఇక్కడ కనిపిస్తాయి. అత్యధికులు ఉపాధి నిమిత్తం వలసలు వెళ్తుంటారు.

ఎక్కెల్లి నుంచి జహీరాబాద్‌గా..నిజాం పాలనలో జహీర్‌యార్‌జంగ్ జాగీర్దార్ ఈ ప్రాంత బాధ్యతలు చూసేవారు. ఆయన పేరుతో జహీరాబాద్‌గా పిలిచారు. నిజాం రాజులు వేటకు వచ్చినప్పుడు ఇక్కడే బస చేసేవారు. నిజాంల కాలంలో కర్ణాటకలో కొనసాగింది. అక్కడి కట్టుబాట్లు కనిపిస్తుంటాయి. కన్నడలో ఎకాహళ్ళీ (పల్లె)గా పిలిచేవారు. ఆ తర్వాత ఎక్కెల్లిగా మారింది. ఆలు, చెరకు, అల్లం, తృణధాన్యాలు ప్రధాన పంటలు.

పచ్చందాల సీమ.. నర్సాపూర్ గతంలో గండి నర్సాపూర్ పేరు ఉండేది. పెద్దదైన రాయరావు చెరువుకు కొన్నేళ్ల కిందట గండి పడిందంట. దీంతో గండి నర్సాపూర్‌గా పేరొచ్చింది. కాలక్రమేణ గండి తొలగిపోయి కేవలం నర్సాపూర్ మిగిలింది. నర్సాపూర్ అనగానే గుర్తుకొచ్చేది అడవులు. చిలప్‌చెడ్, కొల్చారం, హత్నూర మండలాల మీదుగా మంజీరా ప్రవహిస్తుంది. నదీపరివాహకంలోని వేలాది ఎకరాల్లో పంటలు పండిస్తుంటారు.

# ఈ దూరం.. పల్లెకు భారమే!



ఖమ్మం : సత్తుపల్లి మండలం చెరుకుపల్లి పంచాయతీలో తుమ్మలనగర్, జగన్నాథపురం గ్రామాలున్నాయి. తుమ్మలనగర్‌లో 49, జగన్నాథపురంలో మొత్తం 233 ఓట్లు ఉన్నాయి. వీరు రెండు కి.మీ. ప్రయాణించి చెరుకుపల్లి ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓట్లు వేయాల్సి వస్తోంది. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల భారతం..అయిదేళ్లకోసారి వచ్చే ఎన్నికలే ప్రజాభిప్రాయానికి గీటురాయి.. ప్రజాస్వామ్య ఫలప్రదానికి ఓటు వేయాల్సిన బాధ్యత పౌరులపై ఎంతుందో అందుకు కావల్సిన వసతులు సమకూర్చాల్సిన బాధ్యతా అధికార యంత్రాంగంపై అంతే ఉంది. బాధాకర విషయం ఏంటంటే 'మా ముంగిట్లోకి పోలింగ్ కేంద్రాన్ని తీసుకురండి మహప్రభో' అంటూ ఎన్నికలొచ్చిన ప్రతిసారీ వేడుకుంటున్నా పట్టించుకోవటం లేదు. ఓటేసేందుకు కొన్ని పల్లెలు, గూడేలను మైళ్లకొద్దీ నడిపిస్తున్నారు. అక్షర జ్ఞానం అంతగా లేకున్నా పౌర స్పృహను పుణికిపుచ్చుకున్న ఏజెన్సీలో వారి బాధలు వర్ణనాతీతం. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు గమ్యం చేరేందుకు నానా అవస్థలు పడుతున్నారు.. పోలింగ్ శాతం పెరగాలన్నా.. పల్స్ పోలియో కార్యక్రమంలా వంద శాతం ఫలితాలు సాధించాలన్నా పోలింగ్ కేంద్రాల దూరం సమస్య పరిష్కరించాల్సిందే.

ఆరోగ్య భారతం..'రెండు చుక్కలతో నిండు ప్రాణం'.. పోలియో నిర్మూలనే ధ్యేయంగా ఈ నినాదంతో వ్యాక్సిన్‌ను దేశంలో పల్లెపల్లెకూ సమర్థంగా చేర్చారు. ఎక్కడ అవసరం ఉంటుందో అక్కడిదాకా వెళ్లారు.. ఈ ప్రయత్నంలో వాగులూ వంకలు దాటారు.. నిలువెత్తు గుట్టలెక్కారు.. కీకారణ్యంలో కిలోమీటర్లకొద్దీ నడిచారు.. మారుమూల గూడేల్లో చిన్నారుల నోళ్లలోకీ రెండు పోలియో చుక్కలు చేరేదాకా వైద్య, ఆరోగ్య సిబ్బంది తమ రెండు కాళ్లకు పనిచెప్పారు.. ఆరోగ్య భారతం కోసం అహరహం శ్రమించి పోలియోను పొలిమేర దాకా తరిమారు.

తిరుమలాయపాలెం మండలంలోని అజ్మీరాతండా శివారు రాకసితండాలో 130 మంది ఓటర్లున్నారు. వీరు ఓటేసేందుకు 3 కి.మీ. దూరంలోని అజ్మీరాతండాకు వస్తున్నారు. రెండింటి మధ్య ఉన్న ఆకేరు నదిపై వంతెన నిర్మాణం జరిగినా అధికారులు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు.

ఖమ్మం గ్రామీణం మండలం చింతపల్లి శివారు శ్రీనగర్ కాలనీలో 250 మంది ఓటర్లు 3 కి.మీ. దూరంలోని చింతపల్లికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు.తల్లంపాడు పంచాయతీ శివారు నర్సింహాపురంలో 370 మంది ఓటర్లున్నారు. పోలింగ్ రోజు రెండు కి.మీ. దూరంలోని తల్లంపాడుకు రావాల్సిందే.వెంకటగిరి అడ్డరోడ్డు ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ (2)లో 800 మంది ఓటర్లు 2.5 కి.మీ. దూరంలోని కోట నారాయణపురం వెళ్లాల్సి వస్తోంది. కూసుమంచి మండలం రాజుపేట బజారు పంచాయతీ పరిధిలోని తాళ్లగడ్డతండాలో 78 మంది గిరిజన ఓటర్లున్నారు. వీరంతా 3 కి.మీ. దూరంలోని రాజుపేట బజార్‌లో ఓటు వేస్తున్నారు. కొణిజర్ల మండలం ఎల్లన్ననగర్‌లో 200 మంది ఓటర్లున్నారు. వీరంతా 3 కి.మీ. దూరంలో గుబ్బగుర్తికి వచ్చి ఓటు వేయాల్సిందే. క్రాంతినగర్‌లో వంద మంది ఓటర్లు సాలెబంజరకు నడుచుకుంటూ వచ్చి ఓటేస్తున్నారు.

ఖ ఏన్కూరు మండలం కొత్త మేడేపల్లి వాసులు పూర్తి అటవీ ప్రాంతంలో 5 కి.మీ. కాలికి పనిచెబుతూ మేడేపల్లి వచ్చి ఓటు వేయాల్సి ఉంది. దశాబ్దాలుగా ఇక్కడ పరిస్థితి మారడం లేదు. ఏన్కూరు మండలం రంగాపురంలో 160 ఓట్లున్నాయి. కిలోమీటరు పరిధిలోని మూలపోచారానికి నడుచుకుంటూ వచ్చి ఓటు వేయాల్సిందే. ఈ గ్రామాల మధ్య వాగు ఉంది. మూడు దశాబ్దాల క్రితం ఎన్నికలు బహిష్కరించినా సమస్య పరిష్కారం కాలేదు.

దుమ్ముగూడెం మండలం దుబ్బనూతల, కొత్తూరు, కమలాపురం గ్రామాల ఓటర్లు 5 కి.మీ. ప్రయాణించి ఆర్లగూడెంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు.

చర్ల మండలం ఎర్రంపాడు నుంచి చెన్నాపురం పోలింగ్ బూత్‌కు వెళ్లాలంటే 5 కి.మీ. కీకారణ్యంలో నడక తప్పదు.

కొరుక్కోడుపాడు వాసులు ఓటేయాలంటే 5 కి.మీ దూరం నడిచి బోదనెల్లికి చేరాలి. అక్కడ నుంచి ఏదైనా వాహనం పట్టుకొని 11 కి.మీ ప్రయాణిస్తేనే గమ్యం చేరొచ్చు.

బక్కచింతలపాడు వాసులు ఓటు కోసం 5 కి.మీ. కాలినడకన పులిగుండాల చేరుకుంటారు. అక్కడ నుంచి 20 కి.మీ. ప్రయాణించి మామిడిగూడెం పోలింగ్ కేంద్రానికి చేరుకుంటారు. అంటే వీరు ఓటేసేందుకు 25 కి.మీ. ప్రయాణించాలన్నమాట.

రాళ్లాపురం వాసులు 5 కి.మీ. నడిచి పెదమిడిసిలేరు కేంద్రానికి వెళ్లి ఓటేస్తారు.అశ్వారావుపేట మండలం చెన్నాపురం గ్రామస్థులకు పోలింగ్ కేంద్రాన్ని కన్నాయిగూడెంలో ఏర్పాటుచేశారు. ఈ రెండింటి మధ్య దూరం 8 కి.మీ.. చెన్నాపురం పక్కనే 2 కి.మీ. దూరంలో కావడిగుండ్లలో పోలింగ్ కేంద్రం ఉన్నా అక్కడ ఓటేసే అవకాశం వీరికి లేదు.

అశ్వాపురం మండలంలోని కావడిగుండ్ల, గోపన్నగూడెం గ్రామాల వారు వాగుదాటి కన్నాయిగూడెం వెళ్లగలిగితేనే ఓటుహక్కు వినియోగించుకోగలరు.

దమ్మపేట మండలం పూసుకుంట, కట్కూరు గ్రామస్థులది మరీ ఇబ్బందికర పరిస్థితి. ఓటు కోసం 15 కి.మీ. దూరంలోని ఆర్లపెంట (పీఎస్131)కు వెళ్లాల్సి వస్తోంది. వీరికి కనీసం బస్సు సదుపాయం కూడా లేదు. ఎన్నికలకు ముందు ఎన్నిమార్లు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

ములకలపల్లి మండలంలో 1112 మంది ఓటర్లున్న పాతగుండాలపాడు, కొత్తగుండాలపాడు గ్రామస్థులు అష్టకష్టాలు పడుతూ 8 కి.మీ. ప్రయాణించి రాజీవ్‌నగర్ పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు.

# కేటీపీఎస్ 12వ యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేత



పాల్వంచ : పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్(కేటీపీఎస్) ఏడో దశ కర్మాగారం (12వ యూనిట్)లో పది రోజుల పాటు విద్యుదుత్పత్తి నిలిపివేయనున్నారు. ఈ కర్మాగారం పూర్తి విద్యుదుత్పత్తి సామర్థ్యం 800 మెగావాట్లు కాగా ఉత్పత్తి ఆపేశారు. టర్బైన్‌లో తరచూ వైబ్రేషన్స్(ప్రకంపనాలు) తలెత్తుతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు వార్షిక మరమ్మతులు చేశారు. కానీ కొద్ది నెలలకే ప్రకంపనాలు వెలువడుతున్నాయి. ఈ పరిష్కారం కాకపోవడంతో టీఎస్ జెన్కో యాజమాన్యం, బీహెచ్‌ఈఎల్ నిపుణులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం టర్బైన్ వైబ్రేషన్స్ 9, 10, 11 మిల్లి మీటర్ పర్ సెకన్(ఎం.ఎం.)గా నమోదవుతోంది. ఇవి భారీ స్థాయిలో ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. 12 ఎం.ఎం.కు వెళితే యూనిట్‌లో ఉత్పత్తి పూర్తిస్థాయిలో నిలిచిపోతుంది. నిబంధనల ప్రకారం వైబ్రేషన్లు 3, 4, 5 ఎం.ఎం. వరకు ఉండాలి. కానీ అవి అధికంగా ఉండడంతో ఉత్పత్తిపై తరచూ ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో జెన్కో యాజమాన్యం పది రోజుల పాటు యూనిట్‌ను నిలిపివేయాలని నిర్ణయించింది. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)కు చెందిన చెన్నై, హరిద్వార్ నిపుణులను రప్పించి సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించారు. కేటీపీఎస్ 12వ యూనిట్ రాష్ట్రంలోనే అతి పెద్దది. గ్రిడ్‌లో ప్రధాన భూమిక పోషిస్తోంది. కీలకమైన 'సూపర్ క్రిటికల్' టెక్నాలజీతో దీన్ని నిర్మించారు. అయిదు, ఆరు దశల్లో వార్షిక మరమ్మతులు..ఏడో దశలోని యూనిట్ మరమ్మతులకు శరవేగంగా సన్నాహాలు కొనసాగుతున్నాయి. టర్బైన్‌తో పాటు బాయిలర్, యూసీబీ, ఇతర విభాగాల్లో అన్ని సమస్యలు చక్కదిద్దేలా కర్మాగారం సీఈ పాలకుర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందించారు. బీహెచ్‌ఈఎల్ నిపుణులతో పాటు కర్మాగారానికి చెందిన 40 మంది ఇంజినీర్లు, ఉద్యోగులు టర్బైన్ పనుల్లో పనుల్లో పాల్గొననున్నారు. ఇతర విభాగాల వారూ నిర్వహణ పనులకు సన్నద్ధం అయ్యారు. ఇదే కాంప్లెక్స్‌లోని అయిదు, ఆరు దశల్లోనూ రూ.15 కోట్లతో వార్షిక మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20 రోజుల పాటు ఆరో దశ 11వ యూనిట్‌లో పనులు కొనసాగుతాయి. ఈ యూనిట్ పూర్తి ఉత్పత్తి సామర్థ్యం 500 మెగావాట్లు. అయిదో దశలో 250 మెగావాట్ల సామర్థ్యం గల పదో యూనిట్‌లోనూ ఈ నెల 15వ తేదీ నుంచి వార్షిక మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకోసం యాజమాన్యం 40 రోజుల గడువు విధించింది. ఈ రెండు యూనిట్లలో వార్షిక మరమ్మతులకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులు, నిపుణులకు జెన్కో ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

800 మెగావాట్ల సామర్థ్యం గల ఏడో దశ కర్మాగారంలో పది రోజుల్లో టర్బైన్ వైబ్రేషన్లను అదుపులోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే బీహెచ్‌ఈఎల్, ప్లాంట్ ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు తగిన ప్రణాళిక రూపొందించుకున్నాం. బాయిలర్ కూలింగ్‌కు నాలుగు రోజుల సమయం పడుతుంది. అనంతరం కీలక పనులు వేగంగా కొనసాగుతాయి.మందడపు శ్రీనివాసరావు, ఏడో దశ యూనిట్ ఎస్‌ఈ

# అద్భుత ప్రతిభ.. ఆవిష్కరణల వేదిక

ఖమ్మం : విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేలా రమాదేవి పబ్లిక్ స్కూల్ కృషి చేస్తోందని రమాదేవి ట్రస్ట్ ట్రస్టీ రావి చంద్రశేఖర్ పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలోని రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌ప్లోరా 2023-24, యంగ్ సైంటిస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌ను ఆయన పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఖమర్ సుల్తానాతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. చదువులతో పాటు విద్యార్థుల్లోని సృజనాత్మక ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించడంపై దృష్టి పెట్టామని ఆయన వివరించారు. విద్యార్థులు ఆయా విభాగాల్లో వివిధ నమూనాలు రూపొందించి ప్రదర్శించిన తీరు అద్భుతమన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఖమర్ సుల్తానా మాట్లాడుతూ.. విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుతూ అద్భుత నమూనాలతో ఆకట్టుకున్నారని, వారి ప్రోత్సహించేలా ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని వివరించారు. అబ్బురపర్చేలా.. రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు



చేసిన సైన్స్ ఎక్స్‌ప్లోరా 2023-24, యంగ్ సైంటిస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ప్రదర్శనలు విద్యార్థుల్లోని ప్రతిభకు, ఆలోచనాత్మక ఆవిష్కరణలకు వేదికైంది. స్మార్ట్ విలేజ్ మొదలు చంద్రయాన్ వరకు, బాలల భద్రత నుంచి రైల్వే గేట్ల నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగం, పునరుత్పాదక శక్తి వనరులు, ఆహార పదార్థాల్లో నానో సాంకేతికత, వ్యర్థాలతో ఇంధన తయారీ, ఫింగర్ ప్రింట్, డీఎన్ఏ, చికిత్సల్లో లాప్రోస్కోపీ విధానం ఇలా 300లకు పైగా అంశాల్లో వివిధ నమూనాలను 1 నుంచి 10వ తరగతి విద్యార్థులు ప్రదర్శించి ఔరా అనిపించారు. పతకాల పంట ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన రంగోత్సవ్ 2023-24లో రమాదేవి పబ్లిక్ స్కూల్ పతకాల పంట పండించిందని రమాదేవి ట్రస్ట్ ట్రస్టీ రావి చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థులు చిత్రలేఖనం, దస్తూరీతో పాటు ఆయా విభాగాల్లో విద్యార్థులు విజేతలుగా నిలిచి 261 పతకాలను, ట్రోఫీలను సాధించారని వివరించారు. రమాదేవి పబ్లిక్ స్కూల్‌కు జాతీయ స్థాయి ఐకాన్ స్కూల్‌గా గుర్తింపు దక్కడం విశేషమన్నారు.

# హవ్వా.. మీకిది తగునా..!

జనగామ : బడి పిల్లల దుస్తుల విషయంలో జనగామ జిల్లాలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు అందించాల్సిన రెండు జతల ఏకరూప దుస్తులు చాలా పాఠశాలలకు ఇప్పటి వరకు రాలేదు. తాజాగా వీటిని కుట్టడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వీటిని ఎవరికిస్తారు, దుస్తుల సొమ్ము కాజేసిన అధికారులే జేబులో వేసుకుంటారా అన్నది ప్రశ్నగా మారింది. దీనిపై సంబంధిత అధికారులను ఆరా తీయడంతో అప్రమత్తమై పాఠశాలలకు దుస్తులను అందజేశారు. ఆర్నెల్ల తర్వాత అందిన కొత్త దుస్తులను చూసి విద్యార్థులు మురిసిపోతున్నారు.

ఏం జరిగిందంటే..జిల్లాలో ఇద్దరు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు చేపట్టారు. మండల కేంద్రాలకు చేరిన వస్త్రాన్ని ఆయా గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు లేదా దర్జీలకు అప్పగించలేదు. కొందరు ప్రధానోపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా నల్గొండ జిల్లాలోని ఓ గుత్తేదారుకు గంపగుత్తగా వస్త్రాన్ని అందజేశారు. వస్త్రాన్ని తీసుకున్న గుత్తేదారు పత్తా లేకుండా పోయినట్లు సమాచారం. దీంతో బడులు తెరిచిన తర్వాత చాలా పాఠశాలలకు దుస్తులు అందలేదు. కొన్ని పాఠశాలలకే ఒక జత అందాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీయడంతో అధికారులు నల్గొండ జిల్లాకు చెందిన గుత్తేదారుడిని కలిశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఓ కుట్టుపని గుత్తేదారుకు వస్త్రాన్ని అందజేసినట్లు ఆయన చెప్పడంతో అధికారులు అక్కడికి వెళ్లి ఆరా తీసినప్పటికీ ఆయన దొరకలేదని సమాచారం. దీనిపై ఓ ఉపాధ్యాయ సంఘం విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో.. కొందరు నోడల్ అధికారులు ఒక ఇన్‌ఛార్జి విద్యాధికారి కొన్ని మండలాల్లో విద్యార్థులకు అరకొర దుస్తులను అందజేశారు. ఈలోగా దసరా సెలవులు వస్తాయి.. తర్వాత కొత్త దుస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుంది.. జనం మరిచిపోతారని కొందరు నోడల్ అధికారులు దాటవేసినట్లు తెలిసింది.



అసలు కథ ఇప్పుడు మొదలైంది..తాజాగా ఈ విద్యాసంవత్సరం రెండు జతల దుస్తులను కుట్టినవారికి సంబంధిత సొమ్మును ప్రభుత్వం విడుదల చేశారు. జనగామ జిల్లాకు చెందిన 38,626 మంది విద్యార్థులకు రెండు జతల దుస్తులు కుట్టిన ఛార్జీల కింద రూ.38,26,600 విడుదల చేస్తున్నట్లు గత నెల 27న జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో 'న్యూస్‌టుడే' రెండు రోజులుగా విద్యాశాఖ ఉన్నతాధికారులు, నోడల్ అధికారులను ప్రశ్నించి విద్యార్థులకు అందని రెండు జతల దుస్తుల విషయంపై ఆరా తీసింది. దీంతో ఎక్కడ తమ తప్పిదం బయట పడుతుందోనని.. భావించి అధికారులు ఆఘమేఘాల మీద వివిధ మార్గాల్లో దుస్తులు సేకరించి మండల వనరుల కేంద్రాల ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలలకు అందిం చారు. శుక్ర, శని వారాల్లో వీటిని అందించేందుకు ప్రధానోపాధ్యాయులు సన్నాహాలు చేస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా.. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు రెండు జతల దుస్తులను అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. గత వేసవి సెలవుల్లోనే వీటిని మండల వనరుల కేంద్రాలకు అందించింది. పాఠశాలలు తెరిచే నాటికి ఏకరూప దుస్తులు అందించాలని.. జిల్లా విద్యాశాఖకు చెందిన ఒక సెక్టోరియల్ అధికారిణి కుట్టు పనులను పరిశీలించి రోజుకు ఎన్ని జతలు కుట్టారనే వివరాలను చరవాణి ద్వారా అందించాలని ఆదేశించారు. ఈ వస్త్రాన్ని కూడా స్థానిక పొదుపు సంఘాల మహిళలు, దర్జీలకు అందజేసి దగ్గరుండి కుట్టించాలని సూచించారు. అయినప్పటికీ అధికారులు నిబంధనలకు నీళ్లు వదిలారు.

# నిఘా కళ్లకు సుస్తీ..!

సూర్యాపేట : పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన కిషన్‌రావు ఇంట్లో గత నెల 10న పట్టపగలు దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి వచ్చిన కొద్దిసేపట్లోనే గుర్తుతెలియని దొంగ బీరువాలోని తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ.5 వేలను అపహరించాడు. స్థానిక సీసీ కెమెరాలను పరిశీలించగా అవి పనిచేయడం లేదని తేలడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. సూర్యాపేట పట్టణంలోని తిరుమలనగర్‌కు చెందిన ఐదేళ్ల బాలికను వారం క్రితం ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత సమీపంలోని మూసీ కెనాల్ వద్ద అర తులం బంగారు చెవిదిద్దులు, ఆరు తులాల వెండి పట్టీలను తీసుకొని బాలికను వదిలి పరారయ్యారు. పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాను పరిశీలించేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది.
సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ధరావత్ నిఖిల్ ఎనిమిది నెలల క్రితం అనుమానాస్పదంగా చిలుకూరు మండలంలోని సాగర్ కాల్వలో శవమై తేలారు. స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు బయటకు వెళ్లిన నిఖిల్ జనగామ క్రాస్ రోడ్డులో సీసీ కెమెరాలో కనిపించారు. అక్కడి నుంచి జాతీయ రహదారి వైపునకు వెళ్లే మరో సీసీ కెమెరాను పరిశీలిస్తే



అది పనిచేయకపోవడంతో ఏం జరిగిందో పోలీసులు గుర్తించలేకపోయారు. సాగర్ కాల్వ వద్ద జాతీయ రహదారిపైనా అదే పరిస్థితి. ఈ కేసును ఛేదించడం సాధ్యం కాకపోవడంతో పోలీసులు సీబీసీఐడీకి అప్పగించాల్సి వచ్చింది.
జిల్లాలో సీసీ కెమెరాల పనితీరు అధ్వానంగా తయారైంది. మరోవైపు రోజురోజుకూ నేరాల సంఖ్య పెరిగిపోతుండటం, దర్యాప్తులో కీలకమైన సమయాల్లో ఇవి పనిచేయకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. నేరాల నియంత్రణ, కేసుల దర్యాపు సమయంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని పోలీసు ఉన్నతాధికారులు అన్ని ఠాణాల పరిధిలో ముమ్మరంగా ఏర్పాటుచేయించారు. జిల్లాలో మొత్తం 1200కుపైగా కెమెరాలుండగా.. అందులో సగానికిపైగా పనిచేయడం లేదని సమాచారం. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 300 నిఘా కళ్లకు గాను కేవలం 120 మాత్రమే పనిచేస్తున్నాయంటే వాటి నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

సిబ్బంది లేరు.. ప్రత్యేక నిధులు లేవు

జిల్లాలోని సీసీ కెమెరాలను పర్యవేక్షించేందుకు సాంకేతిక నిపుణులు, నిర్వహణకు ప్రత్యేక నిధులూ అందుబాటులో లేవు. దీంతో పోలీసులు స్థానికంగా దాతల సహకారంతో కూడళ్లలో, మలుపు ప్రాంతాల్లో ఏర్పాటు చేయిస్తున్నారు. చిన్నపాటి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసిన సమయాల్లో ఇవి మరమ్మతుకు గురవుతున్నాయి. వీటి పనితీరును కొంత మంది సిబ్బంది పర్యవేక్షించాల్సి వస్తోంది. కొన్ని ఠాణాల్లో పోలీసులు సొంత డబ్బులు వెచ్చించి స్థానిక నిపుణులతో నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం సాంకేతిక సిబ్బందితోపాటు నిర్వహణకు నిధులు కేటాయిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.మరమ్మతులు చేయిస్తున్నాం– నాగభూషణం, డీఎస్పీ, సూర్యాపేట అకాల వర్షాలు, ఈదురు గాలులకు సీసీ కెమెరాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటి వరకు పట్టణంలో 120 సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించాం. త్వరలోనే మిగిలినవి పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

# ఇసుక తవ్వేస్తున్నా.. వారి దృష్టికి రాలేదంట

నిజామాబాద్ : గోదావరి, మంజీరా నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా యంత్రాలతో తవ్వుతున్నారు. ట్రాక్టర్లలో కిలోమీటర్ దూరంలో ఉన్న ఒడ్డు వరకు తీసుకొచ్చి డంపులుగా పోస్తున్నారు. ఇలా వందల కొద్దీ ట్రాక్టర్లతో పోసిన కుప్పలు కనిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి టిప్పర్లలో తరలించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. నిత్యం ఇదే అక్రమ తంతు జరుగుతున్నా రెవెన్యూ, గనులశాఖ, పోలీసులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించటం గమనార్హం.

ఈ ప్రాంతాల్లోనే..

వంతెనకు ఎడమవైపు మంజీరాలో, మొఘల్‌పురా శివారులో వంతెన కింది భాగంలో యంత్రాలతో తోడుతున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తీసుకెళ్లి డంపులు చేస్తున్నారు. ఇంత బహిరంగంగా జరగటాన్ని చూస్తుంటే.. అనుమతి తీసుకొని చేస్తున్నారేమో అనిపిస్తుంది. కానీ ఇక్కడ జరుగుతోంది పూర్తిగా అక్రమ ఇసుక తవ్వకాలే. అయినా ఎవరు అడ్డు చెప్పకపోవటం ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్న పలువురు ఈ దందాలో భాగస్వామ్యం కావడం వల్లే అధికారులు మౌనంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

కట్టడి చేయరా?

ఇసుక తవ్వకాలు జరపాలన్నా, వాహనాల్లో తరలించాలన్నా రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వాలి. ఏదైనా అవసరానికి తీసుకెళ్లాలన్నా టోకెన్లు జారీ చేస్తారు. కందకుర్తిలో అలాంటిదేమీ జరగటం లేదు. ఇష్టానుసారంగా ఎవరికి తోచిన విధంగా వారు ఇసుకను తోడుకొని వెళ్తున్నారు. వందల కొద్దీ ట్రాక్టర్ల ఇసుక డంపులుగా పోసి.. టిప్పర్లలో తరలించి విక్రయిస్తున్నారు. కట్టడి చేయాల్సిన యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం..– రాంచందర్, తహసీల్దార్, రెంజల్

కందకుర్తి వద్ద గోదావరి, మంజీర తీరాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టిలో లేదు. ఇక్కడ ఎవరికి అనుమతి ఇవ్వలేదు. పరిశీలించి అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

తనిఖీలు చేస్తాం– సత్యనారాయణ, గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

ఇసుక తవ్వకాలకు సంబంధించి అనుమతులు రెవెన్యూశాఖ వారే ఇస్తారు. అయితే అక్రమ రవాణాను నియంత్రించడానికి మాశాఖ సిబ్బంది తనిఖీలు చేస్తారు. కందకుర్తి వద్ద డంపులు పోసి ఇతర ప్రాంతాల్లోకి తరలించి విక్రయిస్తున్నట్లు మాకు సమాచారం లేదు. వెంటనే తనిఖీలు చేపట్టి ఆ వాహనాలను సీజ్ చేస్తాం.

# పురంలో.. పన్నుల మోత



సూర్యాపేట : సూర్యాపేట పరిధిలోని బీబీగూడెం పురపాలికలో విలీనమైంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి గతంలో రూ.1000 ఇంటి పన్ను వచ్చేది. భువన్ సర్వే చేయడంతో మూడింతలు పెరిగింది. ఈ విషయమై సర్వే అధికారులను అడుగగా.. ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలానికి కూడా పన్ను వచ్చిందని చెప్పడంతో అవాక్కయ్యారు. భువన్ సర్వేతో పురపాలికల్లో పన్నుల మోత మోగుతోంది. కొత్త పురపాలక చట్టం 2019 ప్రకారం ఆస్తి పన్నులు నమోదు చేయడంతో పన్నుదారులు లబోదిబోమంటున్నారు. గత ఏడాదిగా భువన్ సర్వే నమోదు ఆన్‌లైన్‌లో వేగవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాటిని అమల్లోకి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు కేవలం ఇంటి నిర్మాణం కొలతల ఆధారంగా మాత్రమే పన్నులు విధించి వసూలు చేసిన ప్రభుత్వం.. తాజాగా ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలానికి కూడా పన్ను విధించే విధానాన్ని కొత్త సాఫ్ట్‌వేర్‌లో రూపొందించింది. దీంతో మూడింతల భారం పడనుందని పన్నుదారులు వాపోతున్నారు. మరోవైపు ఆస్తి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నమోదైన విలువ ఆధారంగా వీటి విలువను పరిగణనలోకి తీసుకోవడంతో పన్నుల విలువ మరింత పెరిగిపోయింది. ఇలా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో వార్డులోని ఇంటిని నమోదు చేస్తే చాలు పన్నులు ఎంత మొత్తం వసూలు చేయాలో అదే లెక్కగడుతోంది.

తాత్కాలిక సిబ్బందితో సర్వే

పురపాలక శాఖ ఆదేశాలతో 2020లో మొబైల్ అప్లికేషన్ ద్వారా ఇస్రో భువన్ సర్వేను తాత్కాలిక సిబ్బందితో నమోదు చేయించింది. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు కొంత నగదు ముట్టజెప్పి వారితో సర్వే చేయించి వివరాలు నమోదు చేయించారు. వారికి అవగాహన లేకపోవడంతో హడావుడిగా కొలతలు తీశారనే ఆరోపణలున్నాయి. ఇళ్లకు తాళాలు వేసి ఉన్నా.. తప్పుల తడకగా వివరాలు నమోదు చేశారనే విమర్శలున్నాయి. దీంతో పన్నులు తడిసిమోపెడయ్యాయి. గృహనివాస ఆస్తులకు ఒక మొత్తాన్ని.. వాణిజ్య సముదాయాల వాటికి రెట్టింపుగా పన్నుల విధించేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ విధానాన్ని రద్దు చేసి మరోసారి ఆస్తి కొలతల్ని లెక్కించాలన్న డిమాండ్ పన్నుదారుల నుంచి వినిపిస్తోంది.

విలీన గ్రామాలపై ప్రభావంపురపాలికల్లో విలీనమైన గ్రామాల్లో భువన్ ప్రభావం మరింత పడింది. పురపాలిక పరిధిలోకి వచ్చినా సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. గ్రామాల్లో ఎక్కువగా నిరుపేదలు ఉన్నా రిజిస్ట్రేషన్ కార్యాలయం నమోదు చేసిన విలువ ప్రకారమే పన్నులు చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికే ఇంటి నిర్మాణానికి పడుతున్న ఇబ్బందులకు తోడు పన్నుల బాదుడుపై ఆందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలంలో చిన్న గుడిసె ఉన్నా మొత్తం స్థలానికి పన్ను చెల్లించాల్సి ఉండటంతో నిరుపేదల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు 75 చదరపు అడుగుల లోపు నిర్మాణానికి కేవలం రూ.100 మాత్రమే పన్నులు వసూలు చేయాల్సి ఉన్నా ఆవరణలోని ఇతర స్థలానికి పన్నులు విధించనున్నారు. ఆస్తుల వివరాలు తప్పుగా నమోదై ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి సరి చేస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

# నీలగిరి నడిబొడ్డున ప్రభుత్వ స్థలం కబ్జా



సూర్యాపేట : విలువ అక్షరాల రూ.ఒక కోటికి పైగానే.. దీంతో కొందరు కబ్జారాయుళ్ల కన్ను దానిపై పడింది.. నయానో.. భయానో అధికారులను మెప్పించి రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణలకు బరి తెగించారు. ఈ తతంగం ఏదో మారుమూల ప్రాంతంలో కాదు.. నల్గొండ నడిబొడ్డున గడియారం కేంద్రంలో జరుగుతోంది. నియంత్రించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తోంది. ముందుగా చిన్నపాటి డబ్బాకొట్టు ఏర్పాటు చేసుకుని దాని వెనుక భాగంలో అధికారుల కళ్లు కప్పి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. జీవో 58 ఆసరాగా చేసుకుని క్రమబద్ధీకరణకు సైతం దరఖాస్తులు చేసుకునే ప్రయత్నాలు జరుపుతున్నట్లు సమాచారం.

కళాభారతి స్థలానికి ఎసరు..!

హైదరాబాద్ రవీంద్రభారతి మాదిరిగా నల్గొండ ప్రజలకు ఆధునిక హంగులతో కళాభారతి నిర్మించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. కళాభారతి భవన నిర్మాణానికి నల్గొండ నడిబొడ్డున ఉన్న ఆర్‌అండ్‌బీ, నీటిపారుదలశాఖ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించి అ స్థలంలో నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రతిపాదించగా ప్రభుత్వం ఆమోదించింది. దీంతో రెండు శాఖల కార్యాలయాలను మున్సిపాలిటీ భవనాల్లోకి మార్చారు. త్వరలోనే కళాభారతి నిర్మాణానికి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండగా..మరో పక్క కబ్జాదారులు ఆ స్థలంపై కన్నేశారు. ఎస్‌బీఐకి ఆనుకుని కొంత మేర స్థలాన్ని ఆక్రమించారు.

అందరూ ప్రేక్షకులే..

జిల్లా కేంద్రంలో గడియారం కేంద్రం నుంచి రామగిరి వెళ్లే మార్గంలో ఎస్‌బీఐ పక్కన ఆర్‌అండ్‌బీ స్థలంలో ఏడాది క్రితం ముందుగా ఒక చిన్న డబ్బా ఏర్పాటు చేసి అందులో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. దానిని తొలగించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఇటీవల ఆక్రమణదారులు ప్రజల, అధికారుల కళ్లు కప్పి కళాభారతి స్థలంలో జాతీయరహదారి 565 నుంచి కళాభారతికి కేటాయించిన స్థలంలో ఉన్న ఆలయం వరకు గ్రీన్‌షెడ్లు ఏర్పాటు చేసి చడీచప్పుడు కాకుండా రాత్రి సమయంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. అయితే ఈ ఆక్రమణ వెనుక ఆధార్‌కేంద్రం నిర్వాహకులను ముందు ఉంచి బడా రాజకీయ నాయకులు తెర వెనుక ఉండి కథ నడిపిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను తొలగించి, స్థలాన్ని రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

నల్గొండ జిల్లాకేంద్రం నడిబొడ్డున కళాభారతికి కేటాయించిన స్థలంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలను పుర అధికారులు యంత్రాల సహాయంతో శనివారం కూల్చివేశారు. కళాభారతి నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల శాఖ కార్యాలయాలను మరో చోటకు తరలించి అ స్థలాన్ని కళాభారతికి ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. ఆ స్థలంలో ఇటీవల కబ్జాదారులు కొంత భాగాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇదే విషయంపై పుర కమిషనర్ రమణాచారిని వివరణ కోరగానే ఆయన వెంటనే స్పందించారు. అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తక్షణమే కళాభారతి స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

తక్షణమే తొలగిస్తాం
రమణాచారి, కమిషనర్

కళాభారతికి కేటాయించిన స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం. కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే పరిశీలించి తక్షణమే వాటిని కూల్చి వేస్తాం. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

# బడి బస్సు పొగ.. అనారోగ్యం పాగా

మిర్యాలగూడ : కేరింతలు కొడుతూ.. ఆనందంగా పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులు డీజిల్‌తో నడిచే బస్సుల నుంచి వచ్చే పొగతో అనారోగ్యం పాలవుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కెనడాకు చెందిన 'కెనడియన్ పార్టనర్‌షిప్ ఫర్ చిల్డ్రన్స్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీపీహెచ్‌ఈ)'.. బడి బస్సులు– చిన్నారుల ఆరోగ్యం అంశంపై ప్రత్యేక అధ్యయన నివేదికను ఇటీవలే విడుదల చేసింది. నివేదికలో బస్సుల నుంచి వెలువడే డీజిల్ ఉద్గారాలతో పిల్లల్లో ఏర్పడుతున్న అనారోగ్య సమస్యలతో పాటు పర్యావరణం, విద్యుత్తు వాహనాల వినియోగం అంశాలను విశ్లేషించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,560 బడి బస్సులు ఉండగా.. వాటిలో ప్రయాణిస్తూ నిత్యం వేలాది మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్నారు.పిల్లల్లోనే అధిక సమస్యలు..

వాయు కాలుష్యంతో పెద్దలకంటే పిల్లల్లోనే అధిక సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని బడి బస్సులన్నీ డీజిల్‌తో నడిచేవే. వీటి నుంచి వెలువడే పొగ, ఉద్గారాలతో విద్యార్థుల్లో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయి. ముఖ్యంగా ఎదిగే పిల్లల్లో ఊపిరితిత్తులు సైతం పరిమాణం పెరుగుతూ ఉంటాయి. ఈ సమయంలో వారు గాలి ఎక్కువగా తీసుకుంటారు. అది కలుషితమై ఉండడం వల్ల..ఊపిరితిత్తులు, గుండె పని తీరుతో పాటు మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీపీహెచ్‌ఈ నివేదిక తెలుపుతోంది. దీంతో పిల్లలు శారీరక, మానసిక అనారోగ్యానికి గురవడంతో పాటు హార్మోన్లపై ప్రభావం చూపుతూ..పునరుత్పత్తి సామర్థ్యం సైతం తగ్గుతోంది. దీంతో పాటు బస్సుల నుంచి వచ్చే శబ్ద కాలుష్యంతో డిప్రెషన్, క్యాన్సర్, యాంగ్జయిటీ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు.

విద్యుత్తు బస్సులే మేలు..

పిల్లల ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు.. పర్యావరణానికి మేలు చేసేందుకు కాలుష్య రహిత విద్యుత్తు ఆధారిత వాహనాల వాడకమే మేలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్తు వాహనాల్లోని బ్యాటరీలను తరచూ ఛార్జింగ్ చేస్తుండాలి. దీంతో సమయం వృథా అవుతుంది. దీన్ని అధిగమించడంతో పాటు పర్యావరణ హిత వాహనాల తయారీ కోసం ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్నాయి. బస్సులపై సోలార్ ప్యానెల్స్ అమర్చడం ద్వారా..బ్యాటరీలో ప్రయాణంలోనే ఛార్జింగ్ చేసుకునేలా పరిశోధనలు సాగుతున్నాయి.

# గుత్తేదారుల్లో నిస్తేజం.. పనుల్లో జాప్యం

సూర్యాపేట : ఒకటోసారి.. రెండోసారి..మూడోసారి.. నాల్గోసారి.. ఇది వేలంపాట కాదు. సాగర్ ఎడమ కాల్వ పనులకు టెండర్లు వేసిన తీరు. నాలుగు సార్లు టెండర్ వేసినా ఒక్క గుత్తేదారుడూ ముందుకు రాలేదు. ఎన్నెస్పీ పనులంటేనే గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. పెద్ద కంపెనీలు ఒకటి రెండు టెండర్లు వేసినా పనులు చేయడంలో, అగ్రిమెంట్ చేసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. ఇందుకు నిదర్శనం సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని వంతెనల నిర్మాణాలు, లైనింగ్ పనులు.

ప్రారంభం కాని పనులు..

సాగర్ ఎడమ కాల్వపై గరిడేపల్లి మండలం మర్రికుంట, కుతుబ్‌షాపురం వద్ద ఉన్న వంతెనల, రామాపురం, కరక్కాయలగూడెం కాల్వలపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గతేడాది జనవరి ఆరున మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. కాల్వ పనులతో పాటు లైనింగ్, ఎత్తిపోతల పథకాలకు, ఇతర శాఖల పనులకు సైతం అదే రోజు శంకుస్థాపనలు హుజూర్‌నగర్‌లో చేశారు.



మర్రికుంట వంతెనకు రూ.1.93 కోట్లు, కుతుబ్‌షాపురం వంతెనకు రూ.1.36 కోట్లు, ముక్త్యాల బ్రాంచి కాల్వకు రూ.184.60 కోట్లు, జాన్‌పహాడ్ బ్రాంచి కాల్వకు రూ.52.11 కోట్లు, సాగర్ ఎడమ కాల్వ లైనింగ్ పనులకు రూ.29.02 కోట్లు, జాన్‌పహాడ్ మేజర్‌పై ఎత్తిపోతల పథకానికి రూ.173 కోట్లు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన పనులకు టెండర్ పిలువగా.. సాగర్ కాల్వపై ఉన్న మర్రికుంట వంతెనకు మినహా మిగతా పనులకు గుత్తేదారులు టెండర్ దాఖలు చేశారు. జనవరి 2022లో శంకుస్థాపన చేయగా లైనింగ్ పనులకు మేలో టెండర్ అగ్రిమెంట్ పూర్తయింది. రామాపురం వంతెనకు గత నెలలో, కరక్కాయల గూడెం వంతెనకు రెండు రోజుల క్రితం అగ్రిమెంట్ పూర్తయింది. ప్రధాన కాల్వ, ముక్త్యాల, జాన్‌పహాడ్ బ్రాంచి కాల్వల లైనింగ్, ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయడానికి 18 నెలల (నవంబర్ 2023 వరకు) గడువు విధించారు. ఈ పనులన్నింటినీ 'మెగా' కంపెనీ చేపట్టింది. ముక్త్యాల బ్రాంచి కాల్వ పనులు, ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించగా ప్రధాన కాల్వ లైనింగ్ పనులు, జాన్‌పహాడ్ బ్రాంచి కాల్వ లైనింగ్ పనులు నేటికీ మొదలు పెట్టలేదు.

మర్రికుంట వంతెన..

సూర్యాపేట–గరిడేపల్లి రహదారిలో సాగర్ ఎడమ కాల్వ పైన ఈ వంతెన నిర్మించాల్సి ఉంది. ఇరుకు వంతెన సమస్యను గుర్తించి అత్యవసరమైన మర్రికుంట, కుతుబ్‌షాపురం వంతెనలకు నిధులు మంజూరు చేశారు. మర్రికుంట వంతెన నిర్మాణానికి గతంలో మూడు సార్లు టెండర్ పిలిచినా ఎవరూ ముందుకురాలేదు. దాంతో నాల్గోసారి టెండర్ పిలిచారు. అదీ (8వ తేదీ) సోమవారం వరకు గడువు ఉంది. ఈసారి టెండర్ ఎవరూ వేయకుంటే ఈ ఏడాది పనులకు మోక్షం లేనట్లే. కుతుబ్‌షాపురం వంతెనకు నిధులు మంజూరయ్యే సమయంలో జీఎస్టీ 12 శాతం ఉండగా కొద్ది రోజులకే 18 శాతానికి పెంచారు. మరోసారి అంచనాలు మార్చి అదనపు నిధుల మంజూరుకి పంపారు. అవి వచ్చే సరికి ఆలస్యం కావచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

మూడు నెలలే సమయం

సాగర్ కాల్వలపై చేపట్టే పనులకు వేసవిలో మూడు నెలలే సమయం ఉంటుంది. మే, జూన్, జులై నెలల్లోనే పనులు వేగవంతంగా జరుగుతాయి. ఆగస్టులో ఎగువ జలాశయాలకు వరద వస్తే నీటి విడుదల ముందుగానే ఉంటుంది. గత నాలుగు సంవత్సరాల్లో నీటి విడుదల ఆగస్టు మొదటి, రెండో వారంలోనే జరిగింది. ఏప్రిల్ 20 నాటికి నీటి విడుదల నిలిపివేయడంతో పనులు చేపట్టడానికి ఏప్రిల్ చివరి నుంచి సమయం దొరుకుతుంది. అగ్రిమెంట్ పూర్తయిన పనులకు సైతం మెటీరియల్, యంత్రాలు చేర్చుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఇసుక, కంకర తరలించడానికి 15 రోజులు పడుతుందని గుత్తేదారులు పేర్కొంటున్నారు.

# వరద ముప్పు.. మరమ్మతులతోనే తప్పు

కామారెడ్డి : జిల్లాకేంద్రంలో వరదనీటి కాల్వలు అక్కడక్కడ కొట్టుకుపోయాయి. పది కాలాలపాటు మన్నాల్సిన నిర్మాణాలు అనతికాలంలోనే అధ్వానంగా మారాయి. గతేడాది కురిసిన వానలకు కాల్వలకు పగుళ్లు తేలాయి. సిమెంట్, కాంక్రిట్ ధ్వంసమై వరద తాకిడికి కాల్వ ప్రహారీలు ధ్వంసమయ్యాయి. పనుల నాణ్యత ప్రశ్నార్థకమైంది. రూ.16.85 కోట్లతో చేపట్టిన పనుల్లో ఏటా డొల్లతనం బయటపడుతోంది.

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా..

2040 సంవత్సరం వరకు భవిష్యత్ అవసరాల దృష్ట్యా 10 కి.మీ మేర వరదనీటి కాల్వలు నిర్మించారు. వరద నీరు రోడ్లపైకి చేరకుండా కొత్త పట్టణం నుంచి పాతపట్టణం వైపు కాల్వలు ఏర్పాటు చేశారు. అశోక్‌నగర్, రుక్మిణికుంట, పంచముఖి హనుమాన్‌కాలనీ, బతుకమ్మకుంట, ఉపాధ్యాయకాలనీ, గాంధీనగర్, వాసవీనగర్ మీదుగా సిరిసిల్లరోడ్డులోని నాలాలోకి వరద నీరు వెళ్లేలా ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఏటా పెద్ద ఎత్తున వరద నీరు కాల్వలోకి వస్తుండటంతో తాకిడి తట్టుకోలేక పగుళ్లుబారి ధ్వంసమవుతున్నాయి.

క్షేత్రస్థాయిలో సర్వే చేస్తేనే..

జిల్లాకేంద్రంలో క్షేత్రస్థాయిలో వరదనీటి కాల్వలపై పురపాలక అధికారులు సర్వే చేపట్టి ఎక్కడెక్కడ ధ్వంసమయ్యాయో వివరాలు సేకరించాలని ప్రజలు కోరుతున్నారు. జూన్ మొదటివారం వరకు ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మరమ్మతులు చేపడితే ప్రయోజకరంగా ఉంటుంది. వరదనీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పుడల్లా.. రెచ్చిపోతున్న నక్సలైట్లు: ప్రధాని మోదీ



రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడల్లా ఉగ్రవాదులు, నక్సలైట్లు ధైర్యంగా రెచ్చిపోతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇక్కడి సూరజ్‌పూర్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా మహాదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణాన్ని ప్రస్తావిస్తూ.. ఇక్కడి 30 శాతం కమీషన్ ప్రభుత్వం బహిరంగంగా బెట్టింగ్ నిర్వహిస్తోందంటూ ఆరోపణలు చేశారు. 'దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడల్లా.. ఉగ్రవాదులు, నక్సలైట్లు ధైర్యంతో పెట్రేగిపోయారు. బాంబు పేలుళ్లు, హత్యల వార్తలు వినిపించేవి. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే.. అక్కడ నేరాలు, దోపిడీల పాలన సాగుతుంది' అని ప్రధాని మోదీ ఆరోపించారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకున్న భాజపా నేతల హత్యలను ఉటంకిస్తూ.. స్థానికంగా నక్సల్స్ హింసాత్మక ఘటనలను కట్టడి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. 'మీరు బాంబులు, తుపాకుల నీడలో బతకాలనుకుంటున్నారా? మీ దగ్గర ఎంత డబ్బు ఉన్నా ఏం లాభం..?..' అని ఓటర్లను ప్రశ్నించారు. ప్రతి ఒక్కరికీ భద్రత చాలా ముఖ్యమని.. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌ను గద్దెదించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మహాదేవ్ బెట్టింగ్ యాప్ వ్యవహారంపై సీఎం భూపేశ్ బఘేల్‌ను లక్ష్యంగా చేసుకున్న ప్రధాని మోదీ.. ఈ కుంభకోణం ఇప్పుడు దేశ విదేశాల్లో చర్చనీయాంశమైందన్నారు. రూ.500 కోట్లు లంచం ఇచ్చానని ఈ కేసులో ప్రధాన నిందితుడు మీడియాలో చెబుతున్నాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ దృష్టిలో దేశంలో ఆదివాసీల ఉనికే లేదని, వారిని ఆ పార్టీ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఆదివాసీల సంక్షేమం భాజపా ప్రాధాన్యమన్నారు. ఒక ఆదివాసీ మహిళ (ద్రౌపది ముర్ము) భారత రాష్ట్రపతి అవుతారని ఎవరైనా అనుకున్నారా? అని అడిగారు. ఇదిలా ఉండగా.. ఛత్తీస్‌గఢ్‌లోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకుగానూ తొలి దశలో భాగంగా నేడు 20 స్థానాలకు పోలింగ్ జరుగుతోంది.




భోపాల్: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ అన్ని పార్టీల అగ్రనేతలు విరామం లేకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో సరదా పరిణామం ఒకటి చోటుచేసుకుంది. సభా వేదికపై కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీకి ఓ నాయకుడు బొకే ఇవ్వగా.. దానిని చూసి ఆమె నవ్వకుండా ఉండలేకపోయారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? సోమవారం ప్రియాంక మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

ఆ సందర్భంగా హస్తం పార్టీ నేతలు వేదికపై ఒకరి తర్వాత ఒకరు ఆమెను కలిశారు. కొందరు ఆమెతో ఫొటోలు దిగారు. మరికొందరు పూలు ఇచ్చి ఆమెను పలకరించారు. ఈ సమయంలోనే ఓ నేత వేదికపైకి వచ్చి ఆమెకు బొకే ఇచ్చారు. దానిని చూసిన వెంటనే ప్రియాంక కాస్త ఆశ్చర్యంగా మొహం పెట్టి.. నవ్వుకున్నారు. ఆ బొకేలో పూలు లేకపోవడమే అందుకు కారణం. అక్కడితో ఆగకుండా ఆ బొకేను చూపిస్తూ.. ఇందులో పూలు ఏవి? అని ఆ నేతను సరదాగా ప్రశ్నించడంతో సభావేదికపై నవ్వులు విరబూశాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆ వెంటనే ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రియాంక..

నిత్యావసరాల ధరల పెరుగుదలపై భాజపా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించారు. నవంబర్ 17న మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో సత్తా చాటి, తిరిగి అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ గట్టి ప్రయత్నాలు చేస్తోంది.

# ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసు.. చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా



అమరావతి: రాజధాని ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది.

తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం ఈ నెల 22కి వాయిదా వేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై ఉన్నందున ఆ గడువు వరకు ఆయన్ను అరెస్ట్ చేయబోమని అడ్వకేట్ జనరల్ (ఏజీ) కోర్టుకు తెలిపారు. మధ్యంతర బెయిల్ స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. తొందరపాటు చర్యలేమీ తీసుకునే ఉద్దేశం లేదని ఏజీ తెలిపారు. రాజధాని నగర బృహత్ ప్రణాళిక, ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలైన్‌మెంట్ నిర్ణయం వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ అందిన ఫిర్యాదుతో ఏపీ సీఐడీ చంద్రబాబుపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

**చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్.. బుధవారం విచారణకు వచ్చే అవకాశం** : ఉచిత ఇసుక పథకంపై సీఐడీ నమోదు చేసిన కేసులో తెదేపా అధినేత చంద్రబాబు హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశముంది.

ఉచిత ఇసుక పథకం పేరుతో ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేకూర్చారనే ఆరోపణలతో ఏపీఎండీసీ డైరెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.




ఇంఫాల్: చొరబాటుదారుల ఉచ్చులో చిక్కుకున్న మణిపూర్ పోలీసు కమాండోలను సైన్యానికి చెందిన అస్సాం రైఫిల్స్ బృందం కాపాడింది. కొండపై నుంచి బుల్లెట్ల వర్షం కురుస్తుంటే డేరింగ్ ఆపరేషన్ చేపట్టి వారిని రక్షించింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అసలేం జరిగిందంటే..? అల్లర్లతో అట్టుడికిన ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో ఇటీవల ఓ సీనియర్ పోలీసు అధికారి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. మోరే ప్రాంతంలో హెలిపాడ్ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న సబ్ డివిజనల్ అధికారి చింగ్తం ఆనంద్‌ను చొరబాటుదారులు స్నైపర్ రైఫిల్‌తో కాల్చివేశారు. ఈ ఘటన నేపథ్యంలో మోరే ప్రాంతానికి అదనపు బలగాలను కేటాయించారు. ఈ క్రమంలోనే అక్టోబరు 31న మణిపూర్ పోలీస్ కమాండోల కాన్వాయ్ మోరేకు వెళ్తుండగా.. చొరబాటుదారులు వారిపై మెరుపుదాడికి పాల్పడ్డారు. తెంగ్నౌపాల్ జిల్లాలో ఇంఫాల్–మోరే జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. కొండలపై దాక్కున్న చొరబాటుదారులు.. కమాండోల కాన్వాయ్ హైవే మూలమలుపు వద్దకు రాగానే బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ ఊహించని పరిణామంతో కమాండోలు వాహనం నుంచి దిగి చొరబాటుదారులను ప్రతిఘటించేందుకు విఫలయత్నం చేశారు. అయితే.. కాల్పుల మోత తీవ్రంగా ఉండటంతో వారు అక్కడే చిక్కుకుపోయారు. అదే సమయంలో అటుగా వచ్చిన అస్సాం రైఫిల్స్ బృందం ఈ దాడిని గుర్తించింది. తక్షణమే స్పందించి మణిపూర్ పోలీసులకు సాయం అందించింది. ఓ వైపు బుల్లెట్లు దూసుకొస్తుంటే.. సాహసోపేతంగా వారిని వాహనంలోకి ఎక్కించుకుని అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు బయటకు రాగా.. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ దాడిలో ముగ్గురు కమాండోలు గాయపడగా.. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

## పార్వేటి మండపం కూల్చివేత నిర్ణయంపై టీటీడీ ఈఓకు లీగల్ నోటీస్ పంపాం

తిరుమల : పార్వేటి మండపం కూల్చేవేయాలని నిర్ణయం తీసుకోవడంపై నిన్ననే టీటీడీ ఈఓకు లీగల్ నోటీస్ పంపామని బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. నేడు ఆయన పార్వేటీ మండపాన్ని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ..



కూల్చివేయాలని నిర్ణయం తీసుకోవటం వెనుక ఉన్న అందరిపైనా వారం రోజుల్లో కోర్టులో కేసు వేయనున్నామన్నారు. టీటీడీ ఈవో చాలెంజ్ చేశారు. పార్వేటీ మండపం వద్ద చర్చకు రమ్మంటూ టీటీడీ ఈవో ఛాలెంజ్ చేశారు కాబట్టే వచ్చామని భానుప్రకాశ్ రెడ్డి తెలిపారు. టీటీడీ ఈవో రాజకీయ నాయకుడిలా ఛాలెంజులు విసరటం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా భవిష్యత్తులో ఇలా జరగదని టీటీడీ ఈవో హామీ ఇవ్వాలన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ రాష్ట్ర అధ్యకురాలు పురందేశ్వరి ఈరోజు లేఖ రాశారని భానుప్రకాశ్ రెడ్డి తెలిపారు.

## సుప్రీంలో ఏపీ దొంగ ఓట్లపై కేసు..

### విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్

న్యూఢిల్లీ: ఏపీ దొంగ ఓట్లపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణకు వచ్చింది. అయితే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా విచారణ నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. గతంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసినందున ఈ కేసు విచారణ నుంచి



తప్పుకుంటున్నట్లు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రకటించారు. ఏపీలో దొంగ ఓట్లపై మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఆధ్వర్యంలోని సిటిజెన్స్ ఫర్ డెమొక్రసీ పిటీషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రకటించారు. దీంతో సీజేఐ ఆదేశాలతో మరో ధర్మాసనం ముందు లిస్ట్ చేయాలని రిజిస్ట్రీకి జస్టిస్ బీఆర్ గవాయి సూచించారు.




విజయవాడ: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ముగ్గురు మృతికి కారణమైన బస్సు ప్రమాదంపై దర్యాప్తు కమిటీ నివేదిక సమర్పించింది. డ్రైవర్‌కు సరైన శిక్షణ ఇవ్వకుండానే బస్సు అప్పగించినట్లు రవాణా శాఖ అధికారుల దర్యాప్తు కమిటీ తేల్చింది. బస్సులోని ఆటోమేటిక్ గేర్ సిస్టమ్‌పై డ్రైవర్‌కు సరిగా అవగాహన లేదని, అందువల్లనే ప్రమాదం జరిగిందని దర్యాప్తు బృందం తేల్చింది. ఈ మేరకు దర్యాప్తు బృందం.. రవాణా, ఆర్టీసీ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసింది. దర్యాప్తు బృందం నివేదికలోని అంశాలపై ఉన్నతాధికారులతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సమీక్ష నిర్వహించారు. సోమవారం ఉదయం అదుపు తప్పిన మెట్రోలగ్జరీ ఏసీ బస్సు ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లి రెప్పపాటులో బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఆటోనగర్ డిపోకు చెందిన బస్సును డ్రైవర్ ప్రకాశం రివర్స్ చేసేందుకు ప్రయత్నించగా ఒక్క ఉదుటున అడుగు ఎత్తు ఉన్న ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ప్లాట్‌ఫాంపై ఉన్న బాపట్ల జిల్లా చీరాలకు చెందిన మోటాని కుమారి(45), గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి చెందిన చిన్నారి కాటి ఆయాన్ అలియాస్ చెర్రీ (7 నెలలు), గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం రావిపాడుకు చెందిన బుకింగ్ క్లర్క్ వై.వీరయ్య(21)ల పైకి ఎక్కి నిలిచిపోయింది. వారు బస్సును గమనించి తేరుకునేలోపే చక్రాల కింద పడి, నలిగి ప్రాణాలు కోల్పోయారు.

# సౌతిండియా బీహార్‌గా ఏపీ

అమరావతి: ఏపీ సౌతిండియా బీహార్‌గా మారుతోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం గవర్నర్ నజీర్‌తో టీడీపీ నేతలు భేటీ అయ్యారు. దాదాపు 45 నిమిషాల పాటు ఈ భేటీ కొనసాగింది. అనంతరం టీడీపీ సభ్యుల బృందం మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... చంద్రబాబు సహా టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారని వివరించామన్నారు. ఆధారాల్లేకుండా రోజుల తరబడి జైళ్లల్లో ఉంచుతున్నారన్నారు. 260 కేసులు సీనియర్ నేతలపై పెట్టారని.. టీడీపీ కార్యకర్తలు, సానుభూతి పరులపై 60 వేల కేసులు పెట్టారని అన్నారు. చంద్రబాబుపై ఆధారాల్లేకుండా తప్పుడు కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించామన్నారు. జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌ను ఏపీలోకి రాకుండా ఎలా అడ్డుకున్నారో గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు. ప్రతిపక్ష నేతలపైనే కాకుండా వివిధ వర్గాలకు చెందిన వారిని ఎలా వేధిస్తోన్నారో



వివరించామన్నారు. న్యాయ వ్యవస్థపై వైసీపీ చేసిన దాడులు.. 17–ఏ అంశాన్ని పట్టించకోకుండా చంద్రబాబును ఏ విధంగా అరెస్ట్ చేశారోననే అంశాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని ఆయన చెప్పారు.




హమాస్‌ను భూస్థాపితం చేసేవరకు గాజాపై తమ దాడులు ఆపమన్న ఇజ్రాయెల్.. భీకర ఘర్షణలకు ప్రదేశాల వారీగా స్వల్ప సడలింపులు ఇచ్చేందుకు మాత్రం ముందుకువచ్చింది. మానవతా సాయం, బందీల విడుదల కోసం గాజాలో వ్యూహాత్మక విరామాలను పరిశీలిస్తామని వెల్లడించింది. 'మానవతా సాయాన్ని సులభతరం చేయడానికి, బందీలను విడిపించేందుకు వ్యూహాత్మక స్వల్ప విరామాలను మా దేశం పరిశీలిస్తోంది' అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. అమెరికా శ్వేతసౌధ ప్రతినిధి జాన్ కిర్బీ కూడా ఈ విరామాల గురించి ప్రస్తావించారు. ఈ యుద్ధం గురించి అమెరికా అధ్యక్షుడు బైడెన్, నెతన్యాహు మధ్య జరుగుతున్న చర్చల గురించి వివరిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇదిలా ఉంటే.. అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిడి వస్తున్నప్పటికీ, కాల్పుల విమరణకు మాత్రం ఇజ్రాయెల్ ససేమిరా అంటోంది. యుద్ధం తర్వాత సుదీర్ఘకాలం గాజా భద్రతను తాము చూడాల్సి వస్తుందని భావిస్తున్నట్లు నెతన్యాహు అభిప్రాయం వ్యక్తం చేశారు. గాజాలో ఇజ్రాయెల్ భూతల దాడుల్ని విస్తరిస్తోంది. హమాస్ మిలిటెంట్లు అధికంగా ఉండే ఉత్తరగాజాలో పూర్తి స్థాయి భూతల దాడికి సిద్ధమవుతోంది. అటు హమాస్ కూడా పోరాటానికి సిద్ధంగానే ఉంది. దీంతో వీధి వీధినా పోరాటం జరిగే అవకాశం కనిపిస్తోంది. దీనివల్ల భారీగా ప్రాణ నష్టం సంభవించవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం రైసీ సోమవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. గాజాలో ఇజ్రాయెల్ చర్యలకు ముగింపు పలకడానికి భారత్ తన శక్తిని ఉపయోగించాలని రైసీ కోరారు. ఇజ్రాయెల్, పాలస్తీనా విషయంలో ఎంతోకాలంగా అనుసరిస్తున్న విధానానికే తాము కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా మోదీ ఆయనకు గుర్తు చేశారు.

# సీఎం జగన్ ప్రజారవాణా వ్యవస్థను నాశనం చేశారు




పల్నాడు జిల్లా: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజారవాణా వ్యవస్థను అన్నివిధాలా నాశనం చేశారని, టీడీపీ సీనియర్ నేత, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల నుంచి ప్రజల్లో పెంచుకున్న నమ్మకాన్ని ఆర్టీసీ కోల్పోతోందన్నారు. ఆర్టీసీ దుస్థితికి విజయవాడ ప్రమాదం ఒక ఉదాహరణ మాత్రమేనని, ఆర్టీసీ బస్సెక్కితే క్షేమంగా గమ్యం చేరతామన్న నమ్మకం పోయిందన్నారు. 2 వేలకుపైగా డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉంటే ఎందుకు భర్తీ చేయట్లేదని ప్రశ్నించారు. తుక్కుదశకు చేరిన బస్సులు జగనన్న రోడ్ల దెబ్బకు కుదేల్ అవుతున్నాయని, నట్లు, బోల్టులు వంటి చిన్నచిన్న అవసరాలకు ఆర్టీసీ వద్ద డబ్బుల్లేని దుస్థితి నెలకొందని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. జగన్ ప్రభుత్వం అనాలోచిత, దుర్మార్గమైన విధానాలతో ఆర్టీసీ నష్టపోతోందని దుయ్యబట్టారు. అన్నింటిపై తన పేరు, ఫోటో వేసుకోవడం తప్ప చేసింది సున్నా అని, ప్రచార ఆర్భాటం తప్ప జగన్ ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కేంద్రం నిధులు ఆపేయడంతో నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వ పథకాల పేర్లు మార్చడం తప్ప జగన్ చేసిందేమీ లేదని, కేంద్రం నిధులనే అటు ఇటూ మళ్లిస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారన్నారు. జగన్ పిచ్చి చేష్టలతో రూ. 4 వేల కోట్లు కేంద్రం నిధులు ఆగిపోయాయని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.

# మేడం 'చాలా బాగుంది' రీ ఎంట్రీకి ప్రయత్నాలు..!

తెలుగు ప్రేక్షకులకు 'చాలా బాగుంది' హీరోయిన్ మాళవిక గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. ఈతరం ప్రేక్షకులు కూడా ఈమెను బుల్లి తెరపై చూస్తూనే ఉంటారు. విలక్షణమైన నటిగా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ను సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మాళవిక. ఈ అమ్మడు తెలుగు సినిమా ఇండస్ట్రీలోనే కాకుండా అన్ని సౌత్ భాష ల్లో కూడా నటించి మెప్పించింది. 1999 లో సినీ రంగ ప్రవేశం చేసిన మాళవిక కొన్ని కారణాల వల్ల వివాదాస్పద నటి అన్నట్టుగా ముద్ర పడిపోయింది. దాంతో ఈ అమ్మడికి ఆఫర్లు తగ్గాయి. దాంతో 2007 సంవత్సరం లో సుమేష్ మీనన్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకుని సంసార జీవితం మొదలు పెట్టింది. పెళ్లి తర్వాత మాళవిక గుర్తు పట్టలేనంత బరువు పెరిగి పోయిన విషయం తెల్సిందే. ఆ మధ్య ఒక తెలుగు టాక్ షో కు ఆమె వస్తే చాలా మంది జనాలు



ఆమెను గుర్తించలేదు. అంతగా బరువు పెరిగిన మాళవిక తన మునుపటి రూపం కు వచ్చేసింది. జిమ్ లో రెగ్యులర్ గా వర్కౌట్ లు చేయడంతో పాటు.. డైటింగ్ ఇతర మార్గాల ద్వారా మాళవిక సన్నగా నాజూకుగా మారింది. దాంతో ఇప్పుడు మళ్లీ ఈమె బుల్లి తెరపై సందడి చేస్తోంది. తమిళ్ టీవీ ఛానల్స్ లో రెగ్యులర్ గా కనిపిస్తూ చాలా బాగుంది అనిపించుకుంటున్న మాళవిక త్వరలోనే వెండి తెరపై రీ ఎంట్రీకి సిద్ధం అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం తమిళ్ తో పాటు ఏ భాష లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలు వచ్చినా కూడా చేసేందుకు రెడీ అన్నట్లుగా మాళవిక ఉందట. ఈ మధ్య కాలంలో సీనియర్ హీరోయిన్స్ క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రీ ఎంట్రీ ఇచ్చి మంచి విజయాలను సొంతం చేసుకుని, హీరోయిన్ గా ఉన్నప్పుడు ఎంతగా అయితే సంపాదించారో అంత ఇప్పుడు సంపాదిస్తున్నారు. కనుక మాళవిక గట్టిగా ప్రయత్నాలు చేస్తే ఆ రేంజ్ లో సంపాదించే అవకాశాలు ఉన్నాయేమో చూడాలి.

## మిహికా రానా గ్లామర్ డోస్.. స్టన్నింగ్!

మన స్టార్ హీరోలకి సోషల్ మీడియాలో ఏ స్థాయిలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుందో అందరికి తెలిసిందే. అయితే స్టార్ హీరోల భార్యలు మాత్రం గతంలో అస్సలు బయటకి వచ్చేవారు కాదు. మీడియాకి దూరంగా ఉండేవారు. అయితే మారుతున్న కాలంతో పాటుగా ట్రెండ్ కి తగ్గట్లు వారు అప్డేట్ అవుతూ ఉన్నారు. సెలబ్రెటీల భార్యలు కూడా అదే ఇమేజ్ ని ఆశ్వాదించడానికి ఇష్టపడుతున్నారు. హీరోయిన్స్ కి ఏ మాత్రం తీసిపోని అందంతో సోషల్ మీడియాలో సందడి చేస్తూ ఉన్నారు. ఫ్యామిలీ లైఫ్ కి సంబందించిన ఫోటోలని ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటూనే అప్పుడప్పుడు తమలోని గ్లామర్ ని కూడా బయటకి తీసుకొస్తున్నారు. టాలీవుడ్ ఎక్కువ పాపులారిటీ ఉన్న సెలబ్రెటీ భార్యలలో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ముందుంటారు. ఆమె తనకి సంబందించిన ప్రతి మూమెంట్ ని ఇన్



స్టాగ్రామ్ లో పంచుకుంటారు. అలాగే దగ్గుబాటి రానా భార్య మిహికా కూడా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారు. ఆమె ఇప్పటికే ఇంటీరియర్ డిజైనర్ గా మంచి పాపులారిటీ ఉన్న వ్యక్తి. రానా, మిహికా ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాలలో టాప్ ఇంటీరియర్ డిజైనర్స్ లో మిహికా కూడా ఒకరు. అందుకే ఆమె ఫ్యాషన్ ప్రపంచంలోనే ఉంటారు. కలర్ ఫుల్ కాస్ట్యూమ్స్ తో తనని తాను ఎస్టాబ్లిష్ చేసుకుంటూ ఉంటారు. తాజాగా మిహికా దగ్గుబాటి ఇన్ స్టాగ్రామ్ లో పింక్ కలర్ షార్ట్ స్కట్ తో అదిరిపోయే ఫోటోని షేర్ చేసుకున్నారు. ఈ ఫోటో ఇప్పుడు వైరల్ అవుతోంది. హీరోయిన్స్ కి ఏ మాత్రం తీసిపోని అందంతో ఈ లుక్ లో మిహికా మెరిసిపోతూ ఉండటం విశేషం. మిహికా నటిగా ఎంట్రీ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఈ ఫోటోకి అదిరిపోయే క్యాప్షన్ కూడా మిహికా పెట్టారు. కొన్నిసార్లు రంగులో మార్పు, దృక్కోణంలో మార్పు మాత్రమే రోజును ఉత్సాహంగా ఉంచుతుంది అంటూ మిహికా తన వ్యక్తిత్వాన్ని రిప్రజెంట్ చేస్తూ పింక్ స్కర్ట్ లో గ్లామర్ ఫోటోకి క్యాప్షన్ ఇచ్చారు. ఈ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




# కీర్తి సురేష్ యాక్షన్ హీరో స్టంట్స్



కమర్షియల్ సినిమాల్లో హీరోలు కార్లు జీప్ లను నడుపుతున్న సమయంలో దుమ్ము లేవడం, సడెన్ బ్రేక్ వేసిన సమయంలో వెనుక టైర్లు సర్రున జారడం వంటివి మనం చూస్తూ ఉంటాం. అయితే హీరోలు చేసిన సమయంలో కార్లు రోప్స్ తో కట్టి ఉంచడం చేస్తారు.. లేదంటే డూప్ లతో అలాంటి సన్నివేశాలను ఎక్కువగా చిత్రీకరిస్తారు అనే విషయం తెల్సిందే. అలాంటి యాక్షన్ హీరో స్టంట్స్ ను మహానటి ఫేం అందాల ముద్దుగుమ్మ కీర్తి సురేష్ చేసి అందరిని ఆశ్చర్యపరిచింది. జీప్ లో బీచ్ లో దుమ్ము రేపుతూ ఆమె చేసిన యాక్షన్ స్టంట్ కి అంతా కూడా నోరు పెద్దగా చేసి మరీ చూస్తున్నారు. ఆ స్టంట్ ను ఒకటికి పది సార్లు సోషల్ మీడియాలో నెటిజన్స్ చూడటంతో అది కాస్త వైరల్ అయింది. కీర్తి సురేష్ అందాన్ని ఇప్పటివరకు చూశాం. ఆమె లో ఇది మరో యాంగిల్ అన్నట్లుగా నెటిజన్స్ మాట్లాడుకుంటున్నారు. మొత్తానికి కీర్తి సురేష్ ఈ వీడియో తో మరో సారి వార్తల్లో నిలిచింది. ఈ రేంజ్ లో యాక్షన్ స్టంట్స్ చూపిస్తే ముందు ముందు ఈమె కోసం దర్శకులు యాక్షన్ సినిమాల స్క్రిప్ట్ లు రెడీ చేస్తారేమో అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో తెలుగు లో ఈమె చేసిన భోళా శంకర్ నిరాశపరచడంతో తమిళ్ సినిమాలపై ఎక్కువ ఫోకస్ పెట్టింది. ఒక వైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తూ మరో వైపు హాట్ లేడీగా స్టార్ హీరోల కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ గా కనిపిస్తోంది. హీరోయిన్ గా ఎంత బిజీగా ఉన్నా ఇలాంటి చిల్ మూమెంట్స్ ను సోషల్ మీడియాలో కీర్తి రెగ్యులర్ గా షేర్ చేస్తూ ఉంటుంది.

# జిమ్ లో హాట్ బ్యూటీ అందాల ఆరబోత



తెలుగు, తమిళ, మలయాళ చిత్రాల్లో నటించి మెప్పించిన ముద్దుగుమ్మ పూజా రామచంద్రన్. ఈ అమ్మడు హీరోయిన్ గానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా పలు సినిమాల్లో నటించడం ద్వారా సౌత్ ఇండియన్ సినీ ప్రేమికులకు సుపరిచితురాలు. ఈ అమ్మడు తెలుగు బిగ్ బాస్ లో కూడా సందడి చేసి బుల్లి తెర ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేసిన విషయం తెల్సిందే. ఈ మధ్య కాలంలో సినిమాలకు కాస్త దూరంగా ఉంటున్నా కూడా సోషల్ మీడియా ద్వారా ఈ అమ్మడి అందాల ఆరబోత కంటిన్యూ అవుతోంది. ఆ మధ్య ఈమె పెళ్లి చేసుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. సాధారణంగా సౌత్ హీరోయిన్స్ ఒకప్పుడు పెళ్లి తర్వాత స్కిన్ షో కి దూరంగా ఉండేవారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. పెళ్లి తర్వాత కూడా పూజా రామచంద్రన్ ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు వీడియో లు షేర్ చేస్తోంది. తాజాగా ఈ అమ్మడు జిమ్ లో వర్కౌట్ లు చేస్తున్న ఫోటోలను షేర్ చేసింది. థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ చిరు నవ్వుతో తీసుకున్న సెల్ఫీ ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించడంతో పాటు మళ్లీ సినిమాల్లో బిజీ అయ్యేలా చేస్తుంది. హీరోయిన్ గా కాకున్నా సోషల్ మీడియా లో ఈ అమ్మడు షేర్ చేస్తున్న ఫోటోలను చూస్తూ ఉంటే అతి త్వరలోనే మళ్లీ నటిగా ఛాన్స్ లు దక్కించుకుంటుందనే నమ్మకంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. బుల్లి తెర లేదా వెండి తెరపై మాత్రమే కాకుండా ఓటీటీ ద్వారా కూడా ఈమెను చూడాలని నెటిజన్స్ ఆశ పడుతున్నారు. మరి ఈ అమ్మడు ఓటీటీ లో కనిపించే అవకాశాలు ఉన్నాయా అనేది చూడాలి.

# రందంలో మిల్కీబ్యూటీ మెరుపులు!

మిల్కీబ్యూటీ తమన్నా గ్లామర్ ట్రీట్ గురించి చెప్పడానికేం లేదు. ఎలాంటి ఎంపికల్లోనైనా తమన్నా అందాలు మెరవాల్సిందే. చిట్టిపొట్టి దుస్తులైనా..స్విమ్ షూట్ అయినా మిల్కీ సయ్యాటకు ఫిదా కాక తప్పదు. ఆన్ స్క్రీన్ అయినా అఫ్ ది స్క్రీన్ అయినా తమన్నా తుఫాన్ లా చెలరేగుతుంది అనడానికి ఎన్నో సందర్భాలున్నాయి. తాజాగా అమ్మడు మరోసారి సంప్రదాయ చీరందంలో సైతం తనదైన మార్క్ అందాల వడ్డన చేసింది. ఇదిగో ఇక్కడిలా స్కై బ్లూ కలర్ సారీలో మిరుమిట్లు గొలపుతుంది. ఒళ్లంతా చీరతో కప్పేసి రవిక అందంతో మాత్రం ఎర వేసింది. రవిక ముందరి బటన్లు విప్పేసి క్లీవేజ్ అందాల్ని ఫోకస్ చేసే ప్రయత్నం చేసింది. బ్యాక్ గ్రౌండ్ లో మ్యాచింగ్ లైట్ ఫోకస్ అంతా చీరందంపై పడటంతో మరింత ప్రకాశవంతంగా కనిపిస్తుం ది. అమ్మడి మ్యాకప్ ....సారీకి మ్యాచింగ్



గా ఎంపిక చేసుకున్న యాక్సరసీస్ ప్రతిది అందాన్ని రెట్టింపు చేసాయి. హ్యాపీ దివాలీ అంటూ అడ్వాన్స్ గానే అభిమానులకు అమ్మడు విషెస్ తెలియజేసింది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. పిక్ పై కామెంట్లు అంతే ఆసక్తికరం. లుక్స్ బ్యూటిఫుల్..గార్జియస్ అంటూ అమ్మడి అందాన్ని పొగిడేస్తున్నారు. ఇక తమన్నా కెరీర జర్నీ గురించి తెలిసిందే. వచ్చిన అవకాశాలు అందుకుంటుంది. సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ గా ఛాయిస్ గా కనిపిస్తుంది. అలాగే ఐటం పాటల్లోనూ తనదైన మార్క్ వేస్తుంది. ఇలా రెండు రకాలుగా అవకాశాలు అందుకుటోన్న ఏకైక భామ తమన్నా. ఇటీవలే మాలీవుడ్ లో కూడా ప్రవేశించింది. ప్రస్తుతం అక్కడో సినిమా చేస్తుంది. తమిళ్..తెలుగులో దాదాపు అందరి హీరోల్ని కవర్ చేసింది. ఈ నేపథ్యంలో అమ్మడు మనసు మాలీవుడ్ సినిమాల్ని కోరుకుంటుంది. అక్కడా మిల్కీ మార్క్ వేస్తుంది? అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## మతాంతర వివాహం, భర్త వయసు తేడాపై బెబో

ఇటీవల తన 11వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్న కరీనా కపూర్ ఖాన్ సైఫ్ తో మతాంతర వివాహం గురించి వయసు వ్యత్సాసం గురించి ప్రస్థావించింది. అవి తమ సంబంధాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే దాని గురించి మాట్లాడింది. కరీనా కపూర్ ఖాన్ – సైఫ్ అలీ ఖాన్ బాలీవుడ్ ఆదర్శ జంటగా అందరికీ స్ఫూర్తి. ఈ జంటకు పెళ్లయి 10 సంవత్సరాలకు పైగా అయింది. ఇద్దరు పిల్లలను స్వాగతించారు. వీరిద్దరూ పిక్చర్ పర్ఫెక్ట్ కపుల్ గా హృదయాల్లో నిలిచారు. అయితే బెబో కరీనా తనకంటే పదేళ్ల పెద్ద వయసు ఉన్న సైఫ్ ని పెళ్లాడుతుంటే దానిపై బోలెడన్ని కామెంట్లు వచ్చాయి. ఇక ఇదే విషయమై తాజా ఇంటర్వ్యూలో కరీనా వివరణ ఇచ్చింది. భర్తతో 10 ఏళ్ల వయస్సు అంతరం, సైఫ్‌తో మతాంతర వివాహం గురించి ప్రశ్నలు ఎదుర్కోవడంపై వివరణ ఇచ్చారు. ఇటీవలి



ఇంటర్వ్యూలో, సైఫ్‌తో తన మతాంతర బంధం నమ్మకాలు విశ్వాసాలను ఎలా ప్రభావితం చేస్తుందో ఓపెనైంది. కరీనా –సైఫ్ 2012లో వివాహం చేసుకునే ముందు చాలా సంవత్సరాల పాటు డేటింగ్ చేశారు. ఇద్దరూ సంప్రదాయ ఆచారాలకు స్వస్తి పలికి కోర్టు వివాహాన్ని ఎంచుకున్నారు. కుట మతాలు వయసు అంతరాలు చూడటం కంటే రిలేషన్‌షిప్‌లో చాలా ముఖ్యమైన విషయం సరదాగా ఉండటమేనని కరీనా అన్నారు. మేం సర్వమత సంబంధాల గురించి చర్చించడానికి చాలా సమయం గడుపుతాము. అతడు చాలా ఎనర్జిటిక్ మ్యాన్. సైఫ్ 10 సంవత్సరాలు పెద్దవాడు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఆనందించడం ముఖ్యం. మేం ఒకరినొకరు ఇష్టపడతాము. మా కంపెనీని ఆస్వాధిస్తాం. అతడు ఏ విశ్వాసాన్ని అనుసరిస్తాడు? అతని వయస్సు ఎంత? అనేది ముఖ్యం కాదు. అలాంటివి చర్చనీయాంశం కాదు! అని బెబో ఇంటర్వ్యూలో అన్నారు. తనకు సైఫ్‌కు మధ్య 10 సంవత్సరాల వయస్సు అంతరం గురించి కరీనా ఓపెనైంది. తాను 10 సంవత్సరాలు చిన్నదానిని కావడం సంతోషంగా ఉందని చెప్పింది. వయస్సు ముఖ్యమైనది అనుకుంటే, అతను గతంలో కంటే హాట్ గా ఉన్నాడు. సైఫ్ ఆందోళన చెందాల్సిన పని లేదు. అతడిని చూసి 53 ఏళ్లు అని ఎవరూ చెప్పలేరు అని కరీనా అన్నారు. వయస్సు పట్టింపు లేదు.. గౌరవం ప్రేమ ముఖ్యం. మేము ఒకరితో ఒకరు సరదాగా గడపడం ముఖ్యం అని కరీనా చెప్పారు.




మందమర్రి: సింగరేణిని ప్రైవేటీకరించాలని కేంద్రం యత్నిస్తోందని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని మందమర్రిలో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. "కేంద్రం వద్ద అప్పులు తెచ్చి.. సింగరేణిలో 49శాతం వాటాను కేంద్రానికి కట్టబెట్టింది కాంగ్రెస్ పార్టీయే. ఉన్న తెలంగాణను ఆంధ్రాలో కలిపింది ఆ పార్టీయే. తెలంగాణ రాక ముందు వరకు భయంకర పరిస్థితులు ఉండేవి.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత సింగరేణిని లాభాల బాటలోకి తెచ్చాం. ప్రస్తుతం సింగరేణిలో రూ.2,184 కోట్ల లాభాలు వచ్చాయి. దసరా, దీపావళి బోనస్ రూ.వెయ్యి కోట్లు పంచుతున్నాం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి కార్మికులకు లాభాలలో వాటా 18శాతం మాత్రమే ఇచ్చారు.. కానీ, భారాస ప్రభుత్వం 32 శాతం ఇస్తోంది. సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా రైతుల గురించి ఆలోచించిందా? ఉత్తమ్‌కుమార్‌రెడ్డి .. రైతు బంధు పథకం వృథా అంటున్నారు. పీసీసీ అధ్యక్షుడేమో వ్యవసాయానికి 3గంటల విద్యుత్ చాలంటున్నారు. ధరణి పోర్టల్ ద్వారా రైతు భూమిపై రైతుకే అధికారం ఇచ్చాం. కాంగ్రెస్ నేతలు.. ధరణి పోర్టల్‌ను తీసి బంగాళాఖాతంలో వేస్తామంటున్నారు. ధరణి కావాలో? వద్దో? రైతులే నిర్ణయించుకోవాలి. డబ్బుకు ఓటు అమ్ముకోవద్దు. మనం వేసే ఓటే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఇంకా పరిణతి రావాలి. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. ఎన్నికల వేళ ప్రజలు విచక్షణతో ఓటు వేయాలి" అని సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు.




# తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌కు స్థలాన్ని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రూ.3.70 కోట్ల రూపాయల స్థలాన్ని ప్రభుత్వం జీవో విడుదల చేసి ఆర్బిట్రేషన్‌కు ఉచితంగా ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయవాది కోటి రఘునాథ్ రావు పిటిషన్ దాఖలు చేశారు. రాయదుర్గ, శేర్లింగంపల్లి మండల పరిధిలో ఆర్బిట్రేషన్‌కు మూడెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తూ జీవో జారీ చేసింది. అయితే ఎలాంటి డబ్బులు తీసుకోకుండా ఆర్బిట్రేషన్‌కు స్థలాన్ని ఇవ్వడంపై పిటిషనర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆర్బిట్రేషన్‌కు స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 126పై స్టే ఇవ్వాలని కోర్టును పిటిషనర్లు కోరారు. పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు... తెలంగాణ ప్రభుత్వానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 21కి హైకోర్టు వాయిదా వేసింది.

# తెలంగాణను నాశనం చేసింది కాంగ్రెస్ పార్టీయే: సీఎం కేసీఆర్



మంచిర్యాల: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీపై సీఎం కేసీఆర్ మరోసారి మండిపడ్డారు. తెలంగాణను నాశనం చేసిందే కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. తెలంగాణ బాగు కోసమే పుట్టిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లా మందమర్రి బహిరంగ సభలో మాట్లాడారు. మాయమాటలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిప్పి కొట్టాలని, సింగరేణిని ఖాయిలా పడేసి కేంద్రానికి వాటా ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. అవే బొగ్గు గనులను బీజేపీ ప్రైవేటీకర చేస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీకి ప్రైవేటీకరణ పిచ్చి పట్టుకుందని ఆరోపించారు. అందుకే అన్ని వ్యవస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని బీజేపీపై విమర్శలు గుప్పించారు. ధరణి పోర్టల్‌పై కాంగ్రెస్‌కు కన్ను కుట్టిందని, ధరణి తీసేస్తామంటున్నారని అన్నారు. రైతుబంధు ఇవ్వొద్దంటున్నారని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. 5 ఏళ్ల భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికల విషయంలో ఓటర్లు జాగ్రత్తగా ఉండాలని కోరారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీనే ఆశీర్వదించాలని కోరారు.

# బీజేపీ 4వ లిస్ట్ విడుదల.. ఎంత మంది అభ్యర్థులతోనంటే..

హైదరాబాద్ : బీజేపీ నాలుగవ విడత అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. 12మంది అభ్యర్థులతో నాలుగవ లిస్ట్‌ను బీజేపీ ప్రకటించింది. ఈ లిస్ట్‌లో ఒక మహిళకు చోటు కల్పించింది. వేములవాడ టికెట్‌ను తుల ఉమకే కేటాయించింది. మాజీ గవర్నర్ విద్యాసాగరరావు కొడుకు వికాస్‌రావుకు నిరాశకు గురయ్యారు. జనసేనకు కేటాయించిన స్థానాలను మాత్రం పెండింగ్‌లో పెట్టింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో టికెట్ దక్కకపోవడంతో బీజేపీలో సుభాష్ రెడ్డి చేరారు. ఆయనకు కూడా టికెట్‌ను బీజేపీ కేటాయించింది.

**బీజేపీ 4వ లిస్ట్..** మునుగోడు – చలమల కృష్ణారెడ్డి, వేములవాడ – తులా ఉమ, చెన్నూరు – దుర్గం అశోక్, కొడంగల్ – బంటు రమేష్, గద్వాల్ – బోయ శివ, ఎల్లారెడ్డి – సుభాష్ రెడ్డి, హుస్నాబాద్ – శ్రీరామ్ చక్రవర్తి, సిద్దిపేట – శ్రీకాంత్ రెడ్డి, వికారాబాద్ – నవీన్ కుమార్, మిర్యాలగూడ – సాధినేని శ్రీనివాస్, నకిరేకల్ – మొగులయ్య, ములుగు – అజ్మీర ప్రహ్లాద్ నాయక్.

# ఎన్నికల ముందు మోదీకి బీసీలు గుర్తొచ్చారా?

హైదరాబాద్: ఎన్నికల ముందు మోదీకి బీసీలు గుర్తొచ్చారా అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీసీల కోసం కాంగ్రెస్ ఎంతో చేసిందన్నారు. ఐఐటీ, ఐఐఎమ్‌లో రిజర్వేషన్లు కావాలని కోర్టుకు వెళ్తే అవకాశం లేదని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. ఓబీసీ కుల గణన చేయడానికి రాహుల్ అంగీకరించారని... హామీ కూడా ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు మోడీకి బీసీల ఆత్మగౌరవం గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా కావాలని అడిగిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు మోడీ పక్కన చేరారన్నారు. పవన్ కళ్యాణ్‌ను బీజేపీ వాళ్ళు వాడుకుంటున్నారని అన్నారు. బీసీల గురించి చెప్తున్న పవన్ కళ్యాణ్ కాపుకు చెందిన వారన్నారు. ప్రైవేట్ ఇండస్ట్రీలలో రిజర్వేషన్స్ ఎందుకు అడగలేదని నిలదీశారు. మోడీ ఓబీసీలకు చేస్తున్న



మోసాన్ని గమనించాలని అన్నారు. కాంగ్రెస్ ఒక్కటే బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తుందని వీహెచ్ చెప్పుకొచ్చారు.

# మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యను పరామర్శించిన మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ : మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యను హైదరాబాద్‌లోని వారి నివాసంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. ఆయనతో కొద్ది సేపు మాట్లాడి, ఆయన యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

తాను పాలకుర్తి బీఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు చెప్పారు. త్వరలోనే వచ్చి కలుస్తామని మాట ఇచ్చారు. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, గతంలోనూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చుక్కా రామయ్యను కలిసి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. వయోభారంతో వచ్చిన సమస్యలతో సతమతం అవుతున్న రామయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# మళ్లీ దత్తత అంటే ఉరికిద్దాం.. ఈసారి జండూభామ్ పని చేయదు



నల్గొండ: 2018లో దత్తత పేరుతో నల్గొండ ప్రజలను మోసం చేశారని.. మళ్లీ దత్తత అని చెప్పే వాళ్ళని ఉరికించాలని కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... 30న పోలింగ్ ఉంది కాబట్టి 27 నుంచి మీ అకౌంట్లోకి రుణమాఫీ, రైతు బంధు డబ్బులు వస్తాయని... మోసపోవద్దని అన్నారు. కొట్లాడి తెచ్చిన తెలంగాణాలో.. కేవలం 460 మంది అమరులని వారికే డబ్బులు, ఉద్యోగాలు ఇచ్చారన్నారు. తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్న 1200 మందికి న్యాయం జరగలేదని అన్నారు. ఉద్యోగులకు నెలాఖరుకు జీతాలు, పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని మండిపడ్డారు. కేసీఆర్ డిసెంబర్ 3న రాజీనామా చేస్తారని.. డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

"ఏ హోదాలో ఉన్నా నల్గొండనే శ్వాస.. నా ప్రాణం... మీరే నాకన్నీ.. వారంలో మూడు రోజులు ఇక్కడే ఉంటా. ఈసారి జండూభామ్ పని చేయదు" అని అన్నారు. నల్గొండలో నేను, మునుగోడులో రాజ్‌గోపాల్ రెడ్డి, నకిరేకల్‌లో వీరేశంలను 70 వేల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి 80కి పైగా సీట్లు రాబోతున్నాయని.. ఐదేళ్లు ప్రశాంతంగా నల్గొండను అభివృద్ధి చేసుకుందామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌కు జై కొట్టిన లబానా లంబాడీలు.. నామినేషన్లు వేసే నిర్ణయం ఉపసంహరణ



నిజామాబాద్ :షెడ్యూల్ తెగల కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ సర్కారుకే తమ పూర్తి మద్దతు ఉంటుందని లబానా (కాయితీ) లంబాడీలు స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ పై తమకు పూర్తి నమ్మకం ఉందని, మూడో సారి బి ఆర్ ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చి, తమ సమస్యలు పరిష్కరించేది ఖాయమని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో నామినేషన్లు వేస్తున్నట్లు ప్రకటించిన తమ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారు. ఎంపీ బీబీ పాటిల్ అధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్ రావును వారు కలిశారు. ఈ సందర్భంగా లబానా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు, సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర విషయాల గురించి మంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. షెడ్యూలు తెగల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, సామాజిక, రాజకీయ అంశాల్లో అవకాశాలు కల్పించారన్నారు. గిరిజనుల కల సాకారం చేసేలా, నాలుగు లక్షల ఎకరాలకు పైన పోడు పట్టాలు రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చింది కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో వచ్చేది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని ట్రిక్కులు చేసినా కేసీఆర్ హ్యాట్రిక్ కొడుతారని చెప్పారు. న్యాయ సలహా అనంతరం, సీఎం కేసీఆర్ ఆదేశానుసారం లబానా లంబాడీలు ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు, సంక్షేమ బోర్డు ఏర్పాటు అంశాన్ని తప్పక పరిశీలిస్తామని మంత్రి చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో లబానా లంబాడీ సంఘం స్టేట్ ప్రెసిడెంట్ తాన్ సింగ్ నాయక్, అమర్ సింగ్ నాయక్, చందా నాయక్, బిషన్ లాల్, జగదీష్, గంగారాం, దర్బార్, గోపాల్ తదితర నాయకులు ఉన్నారు.

# సీఎం ఫామ్‌హౌస్‌కి వస్తున్నారంటే...

హైదరాబాద్ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో 15 సంవత్సరాలు ఉన్నానని.. తాను పరాయి వాడిని కాదని.. ఈ నియోజకవర్గ బిడ్డనేనని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. గజ్వేల్ ప్రజలకు ఏ అవసరమైనా వస్తే ఎప్పుడైనా కలిశారా? అని ప్రశ్నించారు. ఫామ్ హౌస్‌లో ముఖ్యమంత్రి ఉంటే చుట్టూ ప్రక్కల గ్రామాలు తీవ్ర ఇబ్బందికి గురయ్యాయన్నారు. సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌కి వస్తున్నారంటే రోడ్డు పక్కన కంకులు, జామకాయలు అమ్ముకునే వారికి కూడా ఇబ్బందేనని ఈటల పేర్కొన్నారు. ఈ రోజు తాను నామినేషన్‌కి వస్తున్నానని ప్రజలు తన ర్యాలీలకు రాకుండా ఆపడానికి కోట్ల రూపాయలతో ప్రజలను అడ్డుకోవాలని చూశారని ఈటల పేర్కొన్నారు. ఈ ఎన్నిక కేసీఆర్ అహంకారానికి.. మన ఆత్మ గౌరవానికి మధ్య జరుగుతోందన్నారు. గజ్వేల్‌లో ఇళ్లు లేని వారందరికీ డబుల్



బెడ్ రూంలు కట్టిస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్ పాలనలో ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే ఒకరికే పెన్షన్ వస్తుందని.. అదే బీజేపీ అధికారంలో ఉంటే ఇద్దరికీ వస్తుందని ఈటల రాజేందర్ వెల్లడించారు.

# జనగామలో నామినేషన్ వేసిన పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ: జనగామ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్ మురళీ కృష్ణకు తన నామినేషన్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు, మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు హాజరయ్యారు. ఇవాళ ఉదయం ఇంట్లో వేద పండితులు పల్లాకు ఆశీర్వచనం అందజేశారు. ముస్లిం,క్రైస్తవ మత పెద్దలు కూడా పల్లాను దీవించారు. ఆ తర్వాత ర్యాలీ తీస్తూ.. పల్లా తన అనుచరులతో నామినేషన్ వేసేందుకు వెళ్లారు. ఇవాళ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేసినట్లు పల్లా మీడియాతో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపించిన జనగామ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని ఆయన కోరారు.




# జర్నలిస్టుల వస్తువులను సీజ్ చేయడం తీవ్రమైన అంశం: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: మీడియాలో పనిచేసే వ్యక్తులు వార్తలను సేకరించేందుకు సోర్సుల కాంటాక్ట్‌లు కలిగివున్న డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకోవడం అత్యంత తీవ్రమైన అంశమని సుప్రీంకోర్టు పేర్కొంది. దర్యాప్తు కోసం వారి పరికరాలను స్వాధీనం చేసుకోవాల్సి వస్తే.. అందుకు ప్రత్యేకమైన మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. దేశంలోని దర్యాప్తు సంస్థలు జర్నలిస్టులను విచారించేందుకు, వారి నుంచి పత్రాలు, హార్డ్‌డిస్కులు, ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు వంటివి స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక విధివిధానాలను రూపొందించాలని కోరుతూ ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఇది చాలా తీవ్రమైన అంశం. మీడియా ప్రొఫెషనల్స్ డిజిటల్ పరికరాల తనిఖీలు, స్వాధీనం కోసం ప్రత్యేకమైన మార్గదర్శకాలు ఉండాలి. మీడియా వ్యక్తులకు వారి సొంత సోర్సులు ఉంటాయి. గోప్యత హక్కు అనేది ప్రాథమిక హక్కు. దానిలో సమతుల్యం పాటించాలి" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. జర్నలిస్టు డిజిటల్ పరికరాల స్వాధీనం కోసం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని ఈ సందర్భంగా కేంద్రానికి సూచించింది. ఇందుకోసం నెల రోజుల గడువు ఇస్తున్నట్లు తెలిపింది. "మీరు కోరుకుంటే మేం మార్గదర్శకాలను రూపొందిస్తాం. కానీ మీరు చేస్తే బాగుంటుందని అనుకుంటున్నాం. ఏజెన్సీలతో నడిచే ప్రభుత్వం కాకూడదు" అని న్యాయస్థానం స్పష్టం చేసింది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను డిసెంబరు 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ విషయమై ఇటీవల 15 మీడియా సంస్థలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. "దేశంలో చాలా మంది పాత్రికేయులు ప్రతీకార దాడులు జరుగుతాయనే భయంతో పనిచేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలకు సంబంధించి కొంతమంది జర్నలిస్టులు రాసే వార్తలను ప్రభుత్వం అంగీకరించడంలేదు. వారిని కట్టడి చేసేందుకు సోదాల పేరిట ప్రతీకార దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తోంది" అని ఆ లేఖలో మీడియా సంస్థలు ఆవేదన వ్యక్తం చేశాయి. కొద్దిరోజుల క్రితం న్యూస్‌క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్‌లో పనిచేసే 46 మంది ఉద్యోగుల ఇళ్లలో ఢిల్లీ పోలీసులు సోదాలు చేసిన విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com